# రైల్వే ప్రయాణికులకు అలెర్ట్

## తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని ట్రైన్స్‌ను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే..!

**హైదరాబాద్,నేటిధాత్రి:**
దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను మిగ్‌జాం తుఫాను కారణంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాపాతం నమోదవుతున్నది. వానల నేపథ్యంలో రవాణా వ్యవస్థపై భారీగా ప్రభావం చూపుతున్నది. తుఫాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే పెద్ద ఎత్తున రైళ్లను రద్దు చేసింది. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో నడిచే




5 లో


# నేటిధాత్రి ®


నిష్పక్షపాత వార్తల నిజరూపం

CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES

బుధవారం 6-12-2023 సంపుటి : 19 సంచిక : 213 పేజీలు : 10 రూ॥ 6.00


# ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు
- బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- హైదరాబాద్‌లో అక్కడక్కడా చిరుజల్లులు



**హైదరాబాద్,నేటిధాత్రి:**
మిగ్‌జాం తుఫాను కోస్తాంధ్ర తీరానికి సమాంతరంగానే కదులుతున్నదని వాతావరణ శాఖ తెలిపింది. తుఫానులో కొంతభాగం సముద్రంలో, మరికొంతభాగం భూమిపై ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. తీరానికి అత్యంత దగ్గరగా తీవ్ర తుఫాను కదులుతున్నదని, తుఫాను కేంద్రంలోని మేఘాలు భూభాగంపై ఉన్నట్లు పేర్కొంది. గడిచిన 6 గంటలుగా గంటకు 7 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా

10 లో

# అప్రమత్తంగా ఉండాలి



10 లో

వర్షాల దృష్ట్యా కలెక్టర్లతో సీఎస్ శాంతి కుమారి టెలీ కాన్ఫరెన్స్



# తుఫాన్ మిచాంగ్ ముంచేస్తుంది

- తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో కుండపోత
- భారీ వర్షాలతో పొంగుతున్న వాగులు వంకలు
- ధాన్యం తడవకుండా అధికారుల చర్యలు
- పలుచోట్ల ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన అధికారులు
- సహాయక చర్యల్లో అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు

- తుఫాన్ ధాటికి నేలకొరిగిన చెట్లు
- కూలిన కరెంట్ స్తంభాలు..పలుచోట్ల విద్యుత్ అంతరాయం
- కొట్టుకు పోయిన గుడిసెలు..నీటమునిగిన పంటలు
- తీరప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**విశాఖపట్నం/విజయవాడ,నేటిధాత్రి:**
తుఫాన్ మిచాంగ్.. తీరం దాటింది. చీరాల, బాపట్ల మధ్య.. తీరం దాటింది. తీరం దాటే సమయంలో 110 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. గాలుల తీవ్రతకు చెట్లు కూలిపోయాయి.. విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగిపోయాయి. కరెంట్ సరఫరా నిలిచింది. తీరానికి 10 కిలోమీటర్ల పరిధిలోని ఉన్న గ్రామాల్లోని పూరిళ్లు కూలిపోయాయి. తీరం సమీపంలో.. రోడ్లపై ఉన్న చిన్న తాత్కాలిక దుకాణాలు ఈదురుగాలులకు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. వందల సంఖ్యలో రైలు సర్వీసులను రద్దు చేశారు అధికారులు. మచిలీపట్నం నుంచి చెన్నై వరకు సముద్రం 30 మీటర్లు ముందుకు వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నెల్లూరు, కావలి మధ్య తీరాన్ని తాకిన మిచాంగ్ తుఫాన్.. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బాపట్ల, చీరాల మధ్య తీరాన్ని దాటింది. తీరం దాటిన సమయంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం

6 లో



5 లో

# ఢిల్లీ నివాసం ఖాళీకి కేసీఆర్ ఆదేశాలు

## ప్రగతిభవన్ నుంచి ఖాళీ చేస్తున్న అధికారులు

**హైదరాబాద్,నేటిధాత్రి:**
ప్రగతి భవన్ ను ఖాళీ చేస్తున్న తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఢిల్లీలోని అధికారిక నివాసాన్ని కూడా ఖాళీ చేస్తున్నారు. ముఖ్యమంత్రులకు ఢిల్లీలో ఓ అధికారిక నివాసం కేటాయిస్తారు.

# మోడీలో ఆత్మవిశ్వాసం



- ఇక తనకు తిరుగులేదన్న భావనలో ప్రధాని
- ప్రధాన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలం
- ప్రజలకు ప్రతికూలంగా మారిన ఆర్థిక విధానాలు

5 లో



- సిఎల్‌పి నేతగా రేవంత్ పేరు ఖరారు చేసిన కాంగ్రెస్
- 7న సిఎంగా రేవంత్ ప్రమాణస్వీకారం
- మీడియా సమావేశంలో ప్రకటించిన కెసి వేణుగోపాల్
- ఉదయం నుంచి సిఎం పదవిపై వరుస భేటీలు..చర్చలు

# తెలంగాణ సీఎంగా రేవంత్

- ఖర్గే, వేణుగోపాల్‌తో డికె శివకుమార్ భేటీ
- కెసి వేణుగోపాల్‌లో ఉత్తమ్, భట్టిల చర్చ
- హైకమాండ్ పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి రేవంత్



**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థిగా పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసింది. సిఎల్‌పి నేతగా రేవంత్ పేరును కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ ప్రకటించారు. 7వ తేదీన రేవంత్ సిఎంగా ప్రమాణం చేస్తారని ప్రకటించారు. సిఎల్‌పి నేతగా రేవంత్‌ను ఎన్నుకున్నామని, అధిష్టానానికి అందిన నివేదకల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సిఎల్‌పీ తీర్మానం మేరకు నిర్ణయించామని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్ బాగా పనిచేశారని, కాంగ్రెస్ గెలుపునకు దోహదపడ్డారని అన్నారు. రేవంత్ ఓ డైనమిక్ లీడర్ అంటూ వేణుగోపాల్ తెలిపారు. ఢిల్లీలో మీడియా సమావేశంలో మాణజగం ఠాక్రే, డికె శివకుమార్ పాల్గొన్నారు. మంతరివర్గ కూర్పు తదితర విషయాలను రేపు ప్రకటిస్తామని అన్నారు. మరోవైపు
అధిష్ఠానం పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాసేపటి క్రితమే గచ్చిబౌలిలోని హోటల్ ఎల్లా నుంచి ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు. అధిష్ఠానం నుంచి సీఎం పదవీపై స్పష్టమైన హామీ రావడంతోనే రేవంత్ ఢిల్లీ బయలు దేరి వెళ్లినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి అధికారం కైవసం చేసుకుంది. రేవంత్ ఢిల్లీ వెళ్లడంతో మంత్రివర్గ ఊహగానాలకు తెరపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే సిఎం ఎంపిక, మంత్రివర్గ కూర్పుపై కాంగ్రెస్ కరసత్తు చేసింది. ఖర్గే నివాసంలో చర్చలు జరిగాయి. కెసి వేణుగోపాలు చర్చించారు. దీనిపై ఓనిర్ణయం తీసుకున్నారని సమాచారం. ముఖ్యమంత్రి పదవికి పలువురు కీలక నేతలు పోటీపడ్డారు. సోమవారమే కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రచారం జరిగింది. ఢిల్లీ వేదికగా మంగళవారం ఉదయం నుంచి వరుస భేటీలు సాగుతున్నాయి. మల్లికార్జున ఖర్గేతో రాహుల్ భేటీ అయ్యారు. తరవాత డికె శివకుమార్ కూడా భేటీ అయ్యారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు కొందరు ఢిల్లీకి చేరుకున్నారు. ఈ క్రమంలో సిఎం ఎవరన్నది ప్రకటించాల్సి ఉంది. అయితే అనూహ్యంగా హైదరాబాద్‌లో ఉన్న రేవంత్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. సిఎం పదవికి రేవంత్ పేరునే నేతలంతా ఖరారు చేశారని, మంత్రివర్గ కూర్పుపై తుదినిర్ణయం తీసుకునేందుకే రేవంత్‌ను ఢిల్లీకి రావాలని ఆదేశించారని సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కాంగ్రెస్ ముఖ్యనేతలతో కీలక సమావేశం జరిగిం ఈ భేటీలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్,

6 లో

# పాగాల సంపత్‌కు కేటీఆర్ నివాళి


- సంపత్ మరణం పార్టీకి తీరని లోటని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ



**జనగామ,నేటిధాత్రి:**
బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పార్థివదేహానికి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా

# కొనసాగుతున్న రాజీనామాలు

- చింతా ప్రభాకర్, రావుల శ్రీధర్ రెడ్డిలు రాజీనామా



**హైదరాబాద్,నేటిధాత్రి:**
తెలంగాణలో నామినేటెడ్ పదవులకు రాజీనామాలు కొనసాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి మంగళవారం చింతా ప్రభాకర్ రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీ నామా లేఖను ప్రభుత్వ ప్రధాన

5 లో

## కాంగ్రెస్ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తాం

### మ్యానిఫెస్టో అమలుకోసం, ప్రభుత్వానికి అండగా ఉంటాం

**హైదరాబాద్,నేటిధాత్రి:**
నూతనంగా ఏర్పడనున్న రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) కేంద్ర సంఘం అభినందనలు తెలిపింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం హర్షం వ్యక్తంచేస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

5 లో




- నాయకుల తప్పిదాలతో బీసీ ల్లో ఐక్యత సాధ్యం కావట్లేదు.
- పూలే, అంబేద్కర్ ల స్ఫూర్తి నింపుకున్న వాణ్ణి కాబట్టే మాదిగల ఉద్యమంలో దాదాపు 15 ఏళ్లు పనిచేసా.
- బీసీ ఉద్యమ అవసరాన్ని ఈ ఎన్నికలుబహిర్గతం చేశాయి.
- బీసీ లను అన్ని రంగాల్లో తిరుగులేని శక్తి గా నిలబెట్టే వరకు శ్రమిస్తా!
- బీసీ రక్షణ సమితి ఆవిర్భావం!

# బీసీ ల గొంతుకనవుతా!

- బీసీ ముఖ్యమంత్రి నినాదాన్ని కూడా అర్థం చేసుకోలేని పరిస్థితి
- బీసీ ల ప్రాతినిధ్యం చట్టసభల్లో తగ్గుతుండడం ప్రమాదకరం
- కాంగ్రెస్ పార్టీ కి, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కి శుభాకాంక్షలు
- బీసీ లకు డిప్యూటీ సీఎం ఇవ్వాలి, బీసీ మంత్రుల సంఖ్యను పెంచాలి.
- రక్షణ , రిజర్వేషన్ , రాజ్యాధికారం ఎజెండా తో పోరాడుతాం.
- బీసీ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు తీగల పదీప్ గౌడ్

10 లో

# జైపూర్‌లో దారుణ హత్య



- రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడిపై కాల్పులు
- ఆస్పత్రికి తరలిస్తుండగా సుఖ్‌దేవ్ సింగ్ గోగామోడీ మృతి

**జైపూర్,నేటిధాత్రి:**
రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణి సేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గోగామోడీని దుండగులు కాల్చిచంపారు. దుండగులు ఆయన ఇంట్లోకి చొరబడి ఆయనపై కాల్పులు జరిపినట్టు ప్రాథమిక సమాచారం. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు, సీనియర్ అధికారులు హుటాహుటిన

5 లో

# పార్లమెంట్‌లో ప్లకార్డుల ప్రదర్శన నిషేధం

- ఎవరైనా అలాచేస్తే చర్యలు తీసుకుంటాం
- ఎంపిలను హెచ్చరించిన స్పీకర్ ఓంబిర్లా




**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
లోక్‌సభలో ప్లకార్డులు తీసుకుని రావొద్దని.. సభలో గౌరవం, క్రమశిక్షణను కొనసాగించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు హెచ్చరిక జారీ చేశారు. ప్లకార్డులు సరికాదన్నారు. ఇది పార్లమెంట్రీ వ్యవహారాలకు తగదన్నారు. ఒకవేళ ఎవరైనా ప్లకార్డులు తీసుకొస్తే మాత్రం.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. తనపై కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ ఎంపీ రమేశ్ బిధురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. బీఎస్పీ సభ్యుడు డానిష్ అలీ పార్లమెంట్ ఎదుట ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తం

5 లో

# సుఖ్‌దేవ్ సింగ్ దారుణ హత్య..

➤సీసీ ఫుటేజ్ వెల్లడించిన పోలీసులు



**డెస్క్, నేటిధాత్రి:**
రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గోగమేది మంగళవారం ఉదయం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. జైపూర్‌లోని తన నివాసంలో ఇద్దరు అనుచరులతో కలిసి ఉన్న సుఖ్‌దేవ్ సింగ్‌పై బైకు మీద వచ్చిన ఇద్దరు దుండగులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు. మాట్లాడుతున్నట్లుగా నమ్మించి సడెన్‌గా దాడిచేశారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సుఖ్‌దేవ్‌ను కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.
కాగా, ఈ ఘటనలో సుఖ్‌దేవ్ ఇద్దరు అనుచరులకు బుల్లెట్ గాయాలయ్యాయి. వారిద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ ఇద్దరికీ చికిత్స కొనసాగుతున్నది. కాగా, కాల్పుల ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను పోలీసులు విడుదల చేశారు. కింది వీడియోలో హత్య దృశ్యాలను మీరు కూడా వీక్షించవచ్చు..

# వరుసగా మూడోసారి సేఫెస్ట్ సిటీగా కోల్‌కతా



**డెస్క్, నేటిధాత్రి:**
భారత్‌లో అత్యంత సురక్షితమైన నగరంగా కోల్‌కతా నిలిచింది. వరుసగా మూడవసారి ఆ నగరం సేఫెస్ట్ సిటీగా నిలవడం విశేషం. జాతీయ నేర గణాంకాల శాఖ ఈ విషయాన్ని తెలిపింది. లక్ష జనాభాలో జరుగుతున్న నేరాల ఆధారంగా ఎన్‌సీఆర్‌బీ ఈ రిపోర్టును ఇచ్చింది. 2022లో కోల్‌కతాలో లక్ష జనాభాలో నమోదు అయిన కేసుల సంఖ్య 86.5 శాతంగా ఉంది. ఇక పుణెలో 280.7, హైదరాబాద్‌లో 299.2 శాతంగా ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ డేటా పేర్కొన్నది. ఐపీసీ, ఎస్‌ఎల్ఎల్ చట్టాల కింద నమోదు అయిన కేసులనే క్రైంగా గుర్తించనున్నారు. 2021లో కోల్‌కతాలో లక్ష జనాభాలో 103.4 కేసులు రిజిస్టర్ అయ్యాయి. ఆ సంఖ్య 2022 నాటికి 86.5కు పడిపోయినట్లు డేటాలో వెల్లడించారు. 2020లో ఆ కేసుల సంఖ్య 129.5గా ఉంది.

# గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుంది

## లోక్‌సభలో డీఎంకే ఎంపీ



**న్యూఢిల్లీ, నేటిధాత్రి:**
డీఎంకే ఎంపీ సెంథిల్‌కుమార్ ఇవాళ లోక్‌సభలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలుగా వర్ణించారు. జమ్మూకశ్మీర్ బిల్లులపై జరిగిన చర్చ సమయంలో ఆయన మాట్లాడుతూ.. హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలు అంటూ విమర్శించారు. ఆ రాష్ట్రాల్లోనే బీజేపీ విజయం సాధిస్తుంది, కానీ దక్షిణాది రాష్ట్రాల్లో కాషాయ పార్టీకి గెలుపు ఉండదని అన్నారు.
ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ పార్టీ విజయం నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ విషయాన్ని గుర్తుచేస్తూ కేవలం ఉత్తరాదిలోనే బీజేపీ గెలుస్తుందని, అవి గోమూత్ర రాష్ట్రాలని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోకి బీజేపీ రాలేదన్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఏపీ, కర్నాటకలో.. స్థానిక పార్టీలే బలంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.
ఎంపీ సెంథిల్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి ఖండించారు. సనాతన సంప్రదాయాన్ని అవమానించినట్లు ఆమె చెప్పారు. త్వరలోనే డీఎంకేకు గోమూత్ర లాభాలు ఏంటో తెలుస్తాయన్నారు. దేశ ప్రజలు ఇలాంటి ద్వేషుల్ని సహించరన్నారు. దేశ మనోభావాలతో ఆడుకోవాలనుకునే వాళ్లకు ప్రజలే బలమైన గుణపాఠం చెబుతారని ఆమె అన్నారు.

# బాపట్ల వద్ద తీరం దాటిన మిజ్‌గాం తుఫాను

## గంటకు 100 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు..!




**డెస్క్, నేటిధాత్రి:**
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను మిజ్‌గాం తీరం దాటింది. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల సమీపంలో తుఫాను తీరం దాటిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తుఫాను తీరం దాటిన నేపథ్యంలో గంటకు 90 నుంచి వంద కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. రాగల రెండు గంటల్లో మిగ్‌జాం తుఫాను బలహీనపడుతుందని వాతావరణశాఖ అంచనా వేసింది. అనంతరం ఆరుగంటల్లోగా వాయుగుండంగా తుఫాను బలహీనపడుతుందని తెలిపింది. తుఫాను తీరం దాటిన నేపథ్యంలో అప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.
ఇదిలా ఉండగా.. తుఫాను ప్రభావంతో తమిళనాడు, ఏపీలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల రోడ్లు నదుల్లా మారాయి. వర్షాలకు చిన్నారి సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు.
తుఫాను తీరం దాటిన సమయంలో రాబోయే 24 గంటల్లో పలుచోట్ల 20 సెంటీమీటర్ల వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భారీ వర్షాల నేపథ్యంలో ఏపీలో 8వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. తిరుపతిలో వర్షాలకు గోడ కూలి నాలుగేళ్ల బాలుడు మృతి చెందగా.. తమిళనాడులో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు చెట్లు నేలకూలరగా.. విద్యుత్ స్తంభాలు తెగిపడ్డాయి. ఏపీలో 140కిపైగా రైళ్లు, 40 విమానాలు రద్దయ్యాయి.

# మిజోరం ముఖ్యమంత్రిగా లాల్దుహెూమా 8న ప్రమాణం



**డెస్క్, నేటిధాత్రి:**
జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ అధినేత లాల్దుహెూమా మిజోరం ముఖ్యమంత్రిగా ఈ నెల 8వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. లాల్దుహెూమా ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. తాజాగా జరిగిన మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో 40 స్థానాలకు గానూ 27 నియోజకవర్గాల్లో జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ గెలుపొంది, సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. ఇక ఇవాళ రాత్రి 8 గంటలకు జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలు.. లాల్దుహెూమా నివాసంలో సమావేశం కానున్నారు.
74 ఏండ్ల వయసున్న లాల్దుహెూమా.. ఐపీఎస్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. పదవీ విరమణ అనంతరం ఆయన రాజకీయాల వైపు మొగ్గు చూపారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. గోవా, ఢిల్లీలో ఆయన ఐపీఎస్‌గా పని చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సెక్యూరిటీ ఇంచార్జి ఆఫీసర్‌గా కూడా పని చేశారు లాల్దుహెూమా. అదే సమయంలో రాజకీయాలకు ఆకర్షితుడైన లాల్దుహెూమా తన ఐపీఎస్ పదవికి రాజీనామా చేశారు. 1984లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.

# 24 గంటల వ్యవధిలో ఆరుగురు చిన్నారులు అదృశ్యం



**డెస్క్, నేటిధాత్రి:**
మహారాష్ట్రలో ఒకే రోజు ఏకంగా ఆరుగురు చిన్నారులు కనిపించకుండా పోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఆదివారం నుంచి సోమవారం వరకూ 24 గంటల వ్యవధిలో ఆరుగురు చిన్నారులు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. థానే జిల్లాలోని నవీ ముంబై టౌన్‌షిప్ పరిసర ప్రాంతాల నుంచి వీరంతా మిస్సైనట్లు వెల్లడించారు. కనిపించకుండా పోయిన వారిలో నలుగురు మైనర్ బాలికలు కాగా, ఇద్దరు బాలురు. అయితే, ఓ బాలుడు మాత్రం తిరిగి తన కుటుంబం వద్దకు చేరినట్లు పోలీసులు తెలిపారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 12 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న మైనర్లు డిసెంబర్ 3 నుంచి 4 మధ్య కనిపించకుండా పోయారు. అందులో కలంబోలి ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలిక ఆదివారం తన క్లాస్‌మేట్ పుట్టిన రోజు వేడుకలకు అని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మరో కేసులో పన్వేల్‌కు చెందిన 14 ఏళ్ల బాలిక ఆదివారం తన స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. అయితే అక్కడి నుంచి తిరిగి రాలేదు. కమోతే ప్రాంతంలో 12 ఏళ్ల బాలిక సోమవారం తన ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది.
రబలే ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలిక సైతం సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఇక అదే ప్రాంతానికి (రబలే) చెందిన 13 ఏళ్ల బాలుడు కూడా సోమవారం తెల్లవారుజామున టాయిలెట్‌కని వెళ్లాడు. ఇక అప్పటి నుంచి ఆ బాలుడి జాడ తెలియరాలేదు. ఇక కోపర్‌ఖైర్నే ప్రాంతం నుంచి తప్పిపోయిన ఓ 12 ఏళ్ల బాలుడు మాత్రం కాసేపటికి తిరిగి తన కుటుంబాన్ని కలుసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మిస్సింగ్ ఘటనలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు చెప్పారు. పిల్లల జాడ కోసం గాలింపు చేపడుతున్నట్లు వారు వివరించారు.

# గత దశాబ్ధం అంతా వాన - వేడి

## ఇండియాపై డబ్ల్యూఎంవో రిపోర్టు

**డెస్క్, నేటిధాత్రి:**
వాతావరణ మార్పులపై దుబాయ్‌లో సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (%ఔమీా =వజూశీతీ%) ఓ నివేదికను రిలీజ్ చేసింది. గత దశాబ్ధం అంటే 2011 నుంచి 2020 వరకు.. ఇండియాలో వాతావరణ మార్పులు ప్రభావం ఉన్నట్లు రిపోర్టులో తెలిపారు. కొన్నేళ్లు వర్షాలు, కొన్నేళ్లు ఎండలు దంచికొట్టినట్లు ఆ నివేదికలో వెల్లడించారు. ఇప్పటి వరకు ఉన్న రికార్డుల ప్రకారం.. గత దశాబ్ధంలో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు తేలింది. కాప్28 సమావేశంలోనూ ఈ విషయాన్ని వెల్లడించిన విషయం తెలిసిందే.
గత ఏడాది వాయవ్య భారత్, పాకిస్థాన్, చైనా, అరేబియా దీవుల్లోని దక్షిణ భాగాల్లో తడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్లు డబ్ల్యూఎంవో తన నివేదికలో పేర్కొన్నది. ఈ ప్రదేశాల్లో వెట్ డికేడ్ నమోదు అయినట్లు చెప్పింది. ఇక 2011 నుంచి 2020 వరకు.. వేడి వాతావరణం కూడా అధికంగానే నమోదు అయ్యింది. 1961 నుంచి 1990 వరకు పోలిస్తే.. ఈశాన్య ఆసియా, యూరోప్, దక్షిణ ఆఫ్రికా, మెక్సికో, ఆస్ట్రేలియా దేశాల్లో మాత్రం వేడి వాతావరణం రెట్టింపు అయినట్లు తెలుస్తోంది.
ప్రపంచవ్యాప్తంగా టెంపరేచర్లు పెరగడంతో.. అతిశీతల వాతావరణ పరిస్థితులు లేకుండాపోయినట్లు తెలుస్తోంది. అతిశీతల రాత్రులు గత దశాబ్ధంలో.. 1961-90తో పోలిస్తే 40 శాతం పడిపోయినట్లు రిపోర్టులో వెల్లడించారు. భారత్‌లో రుతుపవనాల వల్ల తీవ్ర నష్టం 2013లో జరిగినట్లు పేర్కొన్నారు. ఆ సంవత్సరం కురిసిన వర్షాల వల్ల హిమాలయ ప్రాంతాల్లో తీవ్ర వరదలు వచ్చాయన్నారు. వర్షాలు, మంచుచరియలు కరిగిపోవడం వల్ల ఫ్లడ్స్ వచ్చాయి. ఇక 2018, 2019, 2020లో వచ్చిన వరదల వల్ల కేరళలో తీవ్ర నష్టం జరిగింది.
2011 నుంచి 2020 వరకు ఇండియాలో కరువు కూడా నమోదు అయ్యింది. 2011లో సుమారు 28 రాష్ట్రాల్లో కరువును ప్రకటించారు. దీంతో తీవ్ర ఆహార, నీటి కొరత ఏర్పడింది. పంటలు ఎండిపోవడం వల్ల ఆ సమయంలో ప్రజలు ఎక్కువ శాతం ప్రభుత్వ ఆహార సరఫరా(పీడీఎస్) వ్యవస్థపై ఆధారపడ్డారు. కరువు ప్రాంతాల్లో సుమారు 82 శాతం ఇండ్లల్లో ఆహార అభద్రత ఏర్పడినట్లు రిపోర్టులో తెలిపారు.
2001-2010 దశాబ్ధంతో పోలిస్తే 2011-2020 మధ్య కాలంలో అంటార్కిటికాలో 75 శాతం మంచు గడ్డలు కరిగిపోయాయి. గత దశాబ్ధంలో చాలా వరకు దేశాల్లో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు డబ్ల్యూఎంవో సెక్రటరీ జనరల్ పెట్టరి తలాస్ తెలిపారు. సముద్రాల్లో వేడి విపరీతంగా పెరుగుతోందని, సముద్ర నీటి మట్టం కూడా ఊహించని వేగంతో పెరుగుతున్నట్లు డబ్ల్యూఎంవో తెలిపింది. హీట్‌వేవ్స్ వల్ల అత్యధిక సంఖ్యలో గత దశాబ్ధంలో మరణాలు రిపోర్టు అయ్యాయి.

# ఏంటీ లాడ్లీ బెహనా స్కీమ్ ?




**డెస్క్, నేటిధాత్రి:**
మధ్యప్రదేశ్‌లో తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించడంలో లాడ్లీ బెహనా స్కీమ్ చాలా వర్కౌట్ అయినట్లు నిపుణులు చెబుతున్నారు. బీజేపీకి విక్టరీని అందించిన ఆ స్కీమ్ విశేషాలు తెలుసుకుందాం. లాడ్లీ బెహనా యోజనా కింద మహిళలకు ప్రతి నెల రూ.1250 బదిలీ చేస్తారు. పేద ఇంటి మహిళలకు ఈ స్కీమ్ వర్తిస్తుంది. ప్రతి ఏడాది మహిళకు ఆ స్కీమ్‌తో మొత్తం రూ.15 వేలు ముట్టుతాయి. ప్రతి నెల పదవ తేదీ రోజున రాష్ట్ర సర్కార్ నేరుగా మహిళల అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. అయితే లబ్ధి పొందే వారు పన్నుదారులు కాకుండా ఉండాలి. ఇక కుటుంబ ఆదాయం కూడా రెండున్నర లక్షల లోపు ఉండాలి. వివాహం చేసుకున్న, విడాకులు తీసుకున్న మహిళలతో పాటు ఒంటరి మహిళలకు ఈ స్కీమ్ వర్తిస్తుంది. అవివాహిత మహిళలకు ఈ స్కీమ్ వర్తించదు. విద్యా సంస్థల్లో నమోదు అయిన అమ్మాయిలు, మహిళలకు కూడా ఈ స్కీమ్ చెల్లదు.

# ఇండియా కూటమిలో విభేదాలు..!

## నేడు ఢిల్లీలో జరగాల్సిన మీటింగ్ వాయిదా



**డెస్క్, నేటిధాత్రి:**
వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పాటైన 'ఇండియా' కూటమిలో విభేదాలు మొదలైనట్లు తెలుస్తోంది. కూటమి తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ రేపు (డిసెంబర్ 6న) సమావేశానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే అనూహ్యంగా ఆ మీటింగ్ వాయిదా పడింది . ఈ సమావేశానికి కూటమిలోని పార్టీలకు చెందిన పలువురు కీలక నేతలు దుమ్మా కొట్టే యోచనలో ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. మీటింగ్ వాయిదా పడటం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది.
కాగా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కూటమి తదుపరి కార్యాచరణపై చర్చిచేందుకు కాంగ్రెస్ పార్టీ సమావేశానికి పిలుపునిచ్చింది. డిసెంబర్ 6వ తేదీన ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేసింది. అయితే ఆ మీటింగ్ గురించి తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు.
దీదీ బాటలోనే మిగితా కూటమి నేతలు కూడా ఉన్నారు. సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, బీహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా ఇండియా కూటమి భేటీకి దుమ్మా కొట్టనున్నారు. ఆ ఇద్దరూ తమ ప్రతినిధుల్ని భేటీకి పంపనున్నట్లు తెలుస్తోంది. బుధవారం జరిగే ఇండియా బ్లాక్ భేటీకి వెళ్లే ఆలోచనలో అఖిలేశ్ లేరని ఆ పార్టీ ప్రతినిధి రాజేంద్ర చౌదరీ తెలిపారు. ఈ నేపథ్యంలోనే రేపు ఢిల్లీలో జరగాల్సిన కూటమి సమావేశం వాయిదా పడినట్లు తెలుస్తోంది.

## ప్రజలు మార్పు కోరుకుంటున్నారంటే

# ఆందోళన చెందాల్సింది బీజేపీనే

## అఖిలేష్ యాదవ్




**డెస్క్, నేటిధాత్రి:**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేస్తాయని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. మూడు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచినందున ఐక్యంగా బీజేపీని ఓడించాలనే కసి ప్రతిపక్ష పార్టీల్లో మరింత పెరుగుతుందని చెప్పారు. దేశ ప్రజలు బీజేపీని తుదముట్టించాలని కోరుకుంటున్నారని తెలిపారు.
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బట్టి ప్రజలు మార్పును కోరుకుంటున్నారనే విషయం స్పష్టమైందని, ఒక్క మధ్యప్రదేశ్‌లో తప్ప అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారిపోయాయని అఖిలేష్ అన్నారు. కాబట్టి ఈ ఫలితాలను చూసి ఆందోళన చెందాల్సింది బీజేపీనే అని చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజలు కేంద్రంలో కూడా ప్రభుత్వాన్ని మార్చబోతున్నారని జోష్యం చెప్పారు. అధికార బీజేపీపై జనం ఆగ్రహంతో ఉన్నారని విమర్శించారు.

# జెడ్‌పీఎం ప్రధాన కార్యాలయంలో పూజ

## ప్రత్యేక ఆకర్షణగా ఏకైక మహిళా ఎమ్మెల్యే



**డెస్క్, నేటిధాత్రి:**
మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన 'జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (%గ్లావీ%)' పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగి తేలుతున్నాయి. తొలిసారి పార్టీ అధికారంలోకి రావడంతో క్యాడర్‌లో ఫుల్ జోష్ కనిపిస్తోంది. రాష్ట్రమంతటా పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. రాజధాని ఐజ్వాల్ లోని పార్టీ ప్రధాన కార్యాలయంతోపాటు ఇతర కార్యలయాలు సందడిగా మారాయి.
ఇవాళ ఐజ్వాల్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్‌పీఎం అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి లాల్దుహెూమాతోపాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మిజోరం ఏకైక మహిళా ఎమ్మెల్యే బారిల్ వాన్నీసంగీ (32) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మిజోరం అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్న అతిపిన్న వయస్కురాలైన మహిళా ఎమ్మెల్యేగా ఆమె గుర్తింపు పొందారు.

# రేవంత్ రెడ్డికి హార్థిక శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ రామకృష్ణ



**హనుమకొండ, నేటిధాత్రి:**
శాసనసభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొంది తెలంగాణ రాష్ట్రానికి కాబో యే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న అనుముల రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు.
అదేవిధంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ 10 సంవత్సరాల తర్వాత కాం గ్రెస్ అధికారంలోకి వచ్చిందని దీనికి రేవంత్ రెడ్డి చాలా కృషి చేశారని తెలంగాణ రాష్ట్రానికి మూడవ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తుండడం చాలా సంతోషకరమని ఇకనుండి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉంటుందని డాక్టర్ రామకృష్ణ అన్నారు.

నేటిధాత్రి
19 YEAR ANNIVERSARY
19 ఏళ్ల వసంతం
మన నేటిధాత్రి వార్త దినపత్రిక అక్షర ప్రయాణం మొదలు పెట్టి
18 ఏళ్లు పూర్తి చేసుకొని 19 వసంతంలో అడుగిడిన
శుభ సందర్భాన పాఠకులకు,ప్రకటన కర్తలకు,
శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు
మీ ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని విజ్ఞప్తి.
-ఎడిటర్

నేటిధాత్రి
జిల్లాల అనుబంధం
06-12-2023 బుధవారం

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన పరుస్తున్న పోలీస్




**గణపురం, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా గణపురం మండల కస్తూర్బా పాఠశాల నందు ఏ హెచ్ టి యు భూపాలపల్లి జిల్లా ఇంచార్జి ఇన్స్పెక్టర్ శ్రీ అజయ్ కుమార్ గారి ఆదేశానుసారం పిల్లలపై జరుగు లయింగిక దాడుల గురించి బాండెడ్ లేబర్, బాలకార్మిక మానవ అక్రమ రవాణా, గంజాయి నివారణ,మహిళల పై జరుగు దాడులు గురించి అవేర్నెస్ ప్రోగ్రాం చేయనైనది, ఏ హెచ్ టి యు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ,కానిస్టేబుల్ శ్రీనాథ్, పాఠశాల హెడ్ మాస్టర్ ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు అవసరం లేదా.?

- నియోజకవర్గంలో అవినీతి రహిత ప్రజాపాలన అందించిన.
- పైలెట్ ప్రాజెక్టుగా పనులు తెచ్చిన ఘనత తనదే..
- నిత్యం ప్రజల కోసమే పనిచేస్తా..
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




**నర్సంపేట, నేటిధాత్రి :**
ఉద్యమ నాయకుడు ప్రజల కోసం పోరాటం చేసిన,సాధించుకున్న తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేసిన. ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుండి నేటి వరకు ప్రజల కష్టాలను పంచుకున్న.కరోనా సమయంలో నా ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు కడుపులో పెట్టుకొని చూసుకున్న అని మాజీ ఎమ్మెల్యే పెద్ది తెలిపారు.సాధారణ ఎన్నికల్లో ప్రజలు నన్ను అదరించలేదు. కాని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు ప్రజలకు అవసరం లేదా... అని పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు.
ఐదెండ్లకోసారి వచ్చే నాయకుడిని ప్రజలు కోరుకున్నారు కదా అని తెలుపుతూ ఆ నిర్ణయం పట్ల ప్రజల్లో చర్చ జరగాలని ఆయన సూచించారు.ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటమిపాలైన అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట పట్టణంలోని బిఅర్ఎస్ పార్టీ కార్యాలయంలో తొలిసారి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తున్నట్లు,నా పని విధానంలో మార్పులు చేసుకోవాలని గమనించానని తెలిపారు.పది సంవత్సరాల కేసిఆర్ పాలనలో నర్సంపేట నియోజకవర్గం పరిధిలో అవినీతి రహిత ప్రజాపాలన అందించిన ఘనత తనదేనని చెప్పారు.నర్సంపేట నియోజకవర్గ పరిధిలో అన్ని రకాల నిధులు,సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా తెచ్చానని అన్నారు.పాకాల, రంగాయ చెరువు కింద కాలువలు పూర్తి చేయాల్సిన పనులు చాలా పెండింగ్ లో ఉన్నాయని,అలాగే 20 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న బ్రిడ్జిలు పోరాడి తెచ్చి ఇటీవల శంకుస్థాపన చేసుకున్నాము వాటిని ప్రస్తుతం గెలిచిన నాయకులు వాటిని పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోరారు.వందల సంఖ్యలో నాయకత్వం,వేల సంఖ్యలో కార్యకర్తలు నా వెంట ఉన్నారు. టెక్నికల్ గా అవకాశం ఇవ్వకపోయిన నన్ను మరవచ్చు కాని నేను ప్రజలను మరవను,ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని పెద్ది హామీ ఇచ్చారు.రాజకీయంగా నన్ను దెబకొట్టచాడాని ఇద్దరు ప్రతిపక్ష నాయకులు ఒక్కటయ్యారు అని విమర్శించారు.నేడు నియోజకవర్గ పరిధిలో విజన్ తో ముందుకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. నియోజకవర్గంలో 69 సెంటర్లలో పల్లె దవాఖానలు తెచ్చిన, పెండింగ్ లో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేయాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ అవసరాలకు స్థలాన్ని గుర్తించాం,టెండర్లు పిలిచిన వాటిని పూర్తి స్థాయిలో నిర్మాణపనులు చేయాలని తెలిపారు.
అకాల వర్షాలు, వడగండ్ల వానల వలన రైతులకు పంట నష్టపరిహారం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ తో కొట్లాడి రైతులకు,ప్రజలకు ఆపదలో ఆదుకున్న బిడ్డను నేను.ఎన్నికల్లో నాకు ప్రజలు ఈ స్థాయి లో తీర్పు ఇస్తారని ఊహించలేదని అవేదన వ్యక్తంచేశారు.మహిళలకు, యువకులకు ఉపాధి కోసం ట్రైనింగ్ క్యాంపు లు ఏర్పాటు చేశానని ఎన్నో పైలట్ ప్రాజెక్ట్ లు తెచ్చిన ఘనత కూడా తనదేనని తెలిపారు.నాకు రాజకీయలు రావు, ఉద్యమ నేపథ్యంలో వచ్చిన వ్యక్తిని, నాకు కుట్రలు రావు కాబట్టే ప్రజలు నాకు ఈ తీర్పు ఇచ్చారని ఐనప్పటికీ పాజిటివ్ గా తీసుకుంటున్నానని పెద్ది పేర్కొన్నారు.ఎమ్మెల్యే అంటే ఒక బాధ్యతగా ప్రజల కోసం, కార్యకర్తల కోసం పనిచేశానని అన్నారు.
హార్టికల్చర్ యునిట్ కోసం ఫారెస్ట్ అధికారులతో కేసులపాలయ్యానని, అయిన తగ్గకుండా నల్లబెల్లి మండలం కన్నారావుపేటలో రైతులతో మాట్లాడి భూమి సేకరించి హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ శంకుస్థాపన చేసుకున్నామన్నారు.నర్సంపేటలో వందల కోట్ల నిధులు మంజూరు చేసి ఉన్నాయి వాటిని ల్యాప్స్ చేయద్దని ప్యారాలాల్ డ్రైనేజీ కోసం 4 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని వాటిని కూడా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం నా సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రస్తుత ఎమ్మెల్యే గమనించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు.
ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాయిడి రవీందర్ రెడ్డి, నాయకులు గుంటి కిషన్, నల్ల మనోహర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, కౌన్సిలర్ అదార్ల రమాదేవి నాగిశెట్టి ప్రసాద్, కోమండ్ల గోపాల్ రెడ్డి, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి

- మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్



**పరకాల, నేటిధాత్రి:**
తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాలలో నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థిగా వాకిటి శ్రీహరి ముదిరాజ్ బిడ్డ గెలుపొందారని కాంగ్రెస్ ప్రభుత్వంలో కొలువు దీరడంలో ముదిరాజ్ బిడ్డకు మంత్రి పదవి ఇవ్వాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు.వారు మాట్లాడుతూ వాకిటి శ్రీహరి ముదిరాజ్ 17,525 ఓట్ల మెజార్టీతో గెలుపొందారని, 60 లక్షల జనాభా కలిగిన ముదిరాజ్ లకు ఒకే ఒక్క ఎమ్మెల్యే గెలిచారని చాలా సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ సమాజం కోరుకుంటుందని,వాకిటి శ్రీహరికి మెపా తరపున అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి



**వనపర్తి, నేటిధాత్రి:**
కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను హామీలను అమలు చేయాలని నాగర్కర్నూల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బి రాములు మాజీ జెడ్పిటిసి వెంకట య్య యాదవ్ గోపాలకృష్ణ నాయుడు కొత్త గొల్ల శంకర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు ఇప్పుడు రైతులకు పెట్టుబడి ప్రారంభమైందని రైతుల ఖాతాలో రైతుబంధు 15 వేల రూపాయలు జమ చేయాలని రైతు రుణమాఫీ లక్ష నుండి 2 లక్షల వరకురుణ మాఫీ చేయాలని మహిళలకు 2500 రూపాయలు గ్యాస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం సిలిండర్ 500 రూపాయల కు ప్రజలకు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తే మున్సిపల్ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికలలో మండల ప్రాదేశిక ఎన్నికలలో సింగిల్ విండో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు గౌరవించి మళ్లీ కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపిస్తారని అన్నారు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ఓడిపోవడానికి కారణం తెలుగుదేశం పార్టీ అని అన్నారు గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి తెలంగాణ ప్రజలు గిఫ్ట్ ఇచ్చారని అన్నారని రిటర్న్ గిఫ్ట్ చంద్ర బాబు తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ద్వారా బిఆర్ఎస్ పార్టీ ఓడిపోవడానికి రిట న్ గిఫ్ ఇచ్చారని అన్నారు ఈ విలేకరుల సమావేశంలో ఆవుల శ్రీను దస్తగిరి బుచ్చారావు యాదయ్య వెంకటాచారి వి బాలయ్య గట్టు రాధాకృష్ణ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించినందుకు తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు అదేవిధంగా వనపర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గా మెగా రెడ్డిని గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు తెలుగుదేశం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

## ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన టిజెఎస్ నాయకులు



**ఎండపల్లి (జగిత్యాల), నేటిధాత్రి:**
ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ ఉద్యమా ల రథసారథి, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ను జగిత్యాల జిల్లా టిజెఎస్ నాయకులు మంగళ వారం హైదరాబాద్ వెళ్లి కలిశారు. టిజెఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, కోరుట్ల నియోజక వర్గ ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కేశపాక తరుణ్, నాయకులు గోగుల రాజు తదితరులు మంగళ వారం హైదరాబాద్ వెళ్లి ఆచార్య కోదండరాం ను కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో సాధించిన ఎన్నికల ఫలితాల దృష్ట్యా కోదండరామ్ ను వారు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ జన సమితి సంపూర్ణ మద్దతుతో అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలపై, కొన్ని చోట్ల ఓటమికి గల కారణాలపై కూలంకషంగా వారు చర్చించారు. నూతన ప్రభుత్వ ఏర్పాటు విధానం, టిజెఎస్ పక్షాన ప్రభుత్వ దృష్టికి తీసుకెల్లాల్సిన ప్రజా సమస్యలను, అమరవీరుల త్యాగాలు, ఉద్యమ కారుల గుర్తింపు తదితర విషయాలపై చర్చించారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు, తెలంగాణ జన సమితి పాత్రపై కూడా వారు మాట్లాడారు.

## ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు,కృతజ్ఞతాభివందనాలు

- అడ్లూరి కాంతా కుమారి లక్ష్మణ్
- నియోజకవర్గ !అభివృద్ధికి,ఉపాధి అవకాశాల కల్పనకై సలహాలు సూచనలు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి



**ఎండపల్లి (జగిత్యాల), నేటిధాత్రి:**
ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా నా భర్త ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించిన ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు, తల్లులకు,అక్కలు చెల్లెళ్లకు, అన్నదమ్ముల కు, రైతాంగానికి, యువతీ యువకులకు కృతజ్ఞతాభివందనాలు. ఎన్నికల సమయంలో నా భర్తకు, నా కుటుంబ సభ్యులకు, అండగా నిలిచి మీకు మేమున్నామంటూ, మాలో ఆత్మస్థైర్యా న్ని, ధైర్యాన్ని, నింపి విజయ తీరాలకు చేర్చి ఎమ్మెల్యేగా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి న మీ సహాయ సహకారాలు, మా పట్ల చూపిన ప్రేమ ,అనురాగాలు, ఆప్యాయతలు మా కుటుంబం జీవితాంతం మరిచిపోలేము. మీ రుణం మేము ఈ జీవితాంతం తీర్చుకోలేనిది. అనుక్షణం ధర్మపురి నియోజకవర్గ ప్రజానీకానికి సేవలు చేస్తామని వినయ పూర్వకంగా మనవి చేస్తున్నాను. నియోజకవర్గ అభివృద్ధి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు మీరు మీ అమూల్యమైన సలహాలు సూచనలను ఇవ్వాలని ప్రార్థి స్తున్నాను. ఇదే సందర్భంగా నిద్రహారా లు లేకుండా లక్ష్మణ్ కుమార్ గెలుపే లక్ష్యంగా కృషిచేసిన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతిని కార్య కర్తలు అభిమానులకు నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## చిన్ననాటి మిత్రుని కుటుంబానికి చేయూత

- ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి తోకల తిరుపతి మరణం మాకు తీరని లోటు



**జైపూర్, నేటిధాత్రి:**
జైపూర్ మండల్ జెడ్ పి హెచ్ ఎస్ హైస్కూల్లో 2000 సంవత్సరంలో పదవ తరగతి వరకు చదువుకున్న మిత్రుడు ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి తోకల తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది.తమ మిత్రుడు సంతాప సభలో టెన్త్ క్లాస్ మిత్రులు అందరు కలిసి వారి కుటుంబానికి 25000 వేలు మిత్రుడి కుటుంబానికి తమ వంతు సహాయం చేయడం జరిగింది. నీవు మాతో లేవనే బాధ మా హృదయాలను కలిగించి వేస్తుంది. ఏ బాధ వచ్చిన మిత్రుని కుటుంబానికి మేమున్నామని ధైర్యం కల్పించారు.

## గోమాతల సేవల్లో తరిస్తున్న శ్రీ నృసింహా సేవా వాహిని

- డిసెంబర్ 6 నుండి 10వరకు గోశాల ప్రారంభోత్సవ వేడుకలు
- గోమాతల సన్నిధిలో గోవిందుడు




**భద్రాచలం, నేటిధాత్రి:**
భద్రాచలం :శ్రీనృసింహ సేవావాహిని ఆధ్వర్యంలో అద్భుతమైన గోశాల ను నిర్మించడం జరిగినది. గోవుని గోవిందున్ని ఓకే దగ్గర దర్శించి తరించే భాగ్యాన్ని భక్తులకు కలగాలనే ఉద్దేశ్యంతో సంస్థ వ్యవస్థాపకులు డా. కృష్ణ చైతన్య స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీనృసింహ భక్త కుటుంబం ఆధ్వర్యంలో గో- గోవింద కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమాన్నిలిఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డా. కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ రోజురోజుకి గోవుకు ఆదరణ తగ్గుతున్నదని గోమాత ప్రాముఖ్యతను లోకానికి చాటి చెప్పడానికే ఈ సుందరమైన గోశాల నిర్మాణం చేయడానికి పూనుకు న్నామని, సకల దేవతా రూపమైన గోమాతను గోవిందున్ని ఏక కాలంలో దర్శిస్తే ఎంతో పుణ్యం కలుగుతుందని అన్నారు, అంతేకాకుండా తమ పూర్వీకుల నుండి వారస త్వంగా పూజలు అందుకుంటూ వస్తున్న 750 సంవత్స రాల క్రితం నాటి కల్ప వృక్ష నరసింహ సాల గ్రామ మూర్తిని కూడా భక్తులు దర్శించి తరించే భాగ్యాన్ని అంద రికీ కల్పించనున్నామని అన్నారు.ఇక్కడ నారసింహుని రక్ష కట్టుకొని ముడుపులు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం అందుకే సుదూర ప్రాంతాల నుండి ప్రతి నిత్యం కొన్ని వందల మంది దర్శనం కొరకు వస్తుంటారని ఎంతో మంది కోర్కెలు నెరవేరి మళ్ళీ మళ్ళీ రావడం సకాలంలో కొన్ని కొన్ని సార్లు వారికి దర్శనభాగ్యం కలగక పోవడం తో భక్తుల సౌకర్యం కొరకు గోవుని గోవిందున్ని ఒక దగ్గర చేర్చి ప్రతి ఒక్కరికి దర్శన భాగ్యం కలిగించాలని ఈ మన్యంలో గో గోవింద కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమాన్ని నిర్మించడ%శీ% జరిగినదని అన్నారు డిసెంబర్ 6వ తారీకు బుధవారం నుండి డిసెంబర్ 10వ తారీకు ఆదివారం వరకు ప్రతిరోజు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నామనిఅన్నారు ప్రతి రోజు శ్రీ లక్ష్మీనారసింహ హెూమం, సుదర్శన హెూమంతో పాటు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సంపూర్ణ అనుగ్రహం భక్తులందరికీ కరగాలని మహాలక్ష్మి యాగాన్ని నిర్వహించనున్నామని అన్నారు అంతే కాకుండా ప్రతిరోజు దర్శనం కొరకు వచ్చే యాత్రికులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కూడా ఉన్నదని కావున భక్తులందరూ స్వామివారిని దర్శించి తరించాలని కోరారు.

## మండలంలో సీనియర్ సిటిజన్ సమావేశం



**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:**
మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో మంగళ వారం రాజు సీనియర్ సిటిజన్ ఫోరం సమావేశం నిర్వహించారు. అబ్దుల్ లతీఫ్ అధ్యక్షతన వహించి వయవృద్ధుల సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం కొండాపురం హనుమయ్య భగవద్గీత ఆధ్యాత్మిక చింతన క్లుప్తంగా వివరించారు.ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర అప్ప మాట్లాడుతూ వయవృద్ధుల ఆరోగ్యం పట్ల తీసుకునే ఆహారాల అలవాట్లను తెలియజేశారు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరమ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి నర్సింలు, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్,వివో ఆనందం, పండరీనాథ్,సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందిన జనంపల్లి అనిరుద్ రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ ఫోరమ్ ఫర్ బెటర్ జడ్చర్ల మున్సిపాలిటీ నాయకులు జడ్చర్ల వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాజకీయ భవిష్యత్తుని ఇచ్చిన మన జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలం మని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వలని కొరుతూ ఫోరమ్ ఫర్ బెటర్ జడ్చర్ల మున్సిపాలిటీ అధ్యక్షులు,కాంగ్రెస్ యువ నాయకుడు పెద్ది బాలకృష్ణ అధ్వర్యంలో జడ్చర్ల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం లో పూజలు నిర్వహించడం జరగింది ఈ కార్యక్రమంలో నాయకులు వాసవి శ్రీనివాసులు,నరేందర్ రెడ్డి,గుంత అశోక్ కుమార్,గోనెల శ్రీనివాస్,బాలకృష్ణ సాగర్,జంగి రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

**జడ్చర్ల వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు.**



## ఎమ్మెల్యేలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన బివి శివశంకర్ రావు





**కొల్చారం (మెదక్), నేటిధాత్రి:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన గూడెం మైపాల్ రెడ్డికి భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం, సంగారెడ్డి జిల్లా స్వచ్ఛంద సేవ అధ్యక్షులు బివి శివశంకర్ రావు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### సంగారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన శివశంకర్ రావు..

సంగారెడ్డి నుంచి నూతనంగా బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన చింతల ప్రభాకర్ ను బివి శివశంకర్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుంచి భారీ మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యేలను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని సంగారెడ్డి జిల్లా స్వచ్ఛంద సేవ అధ్యక్షులు బివి శివశంకర్ రావు తెలిపారు.

నేటిధాత్రి
19 YEAR ANNIVERSARY
19 ఏళ్ల వసంతం
మన నేటిధాత్రి వార్త దినపత్రిక అక్షర ప్రయాణం మొదలు పెట్టి
18 ఏళ్లు పూర్తి చేసుకొని 19 వసంతంలో అడుగిడిన
శుభ సందర్భాన పాఠకులకు,ప్రకటన కర్తలకు,
శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు
మీ ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని విజ్ఞప్తి.
-ఎడిటర్

## నూతన ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన శివ శంకర్ రావు



**కొల్చారం (మెదక్), నేటిధాత్రి:**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నుంచి నూతనంగా గెలుపొందిన వాకిట సునీత లక్ష్మారెడ్డిని భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం , సంగారెడ్డి జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి శివశంకర్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. సునీత లక్ష్మారెడ్డిని కలిసిన వారిలో శివ శంకర్ రావు తో పాటు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా తీర్పును గౌరవిస్తాం

- ప్రజలు పెద్ద బాధ్యత అప్పగించారు.
- జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి.



**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:**
జడ్చర్ల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చర్ల కోల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పై ఓటమిపాలైన విషయం తెలిసిందే ప్రజా క్షేత్రంలో గెలుపు ఓటములు సహజమేనని బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం నిజాయితీగా పనిచేసిన ప్రతి ఒక్కరికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష కొరకు తన ఎమ్మెల్యే పదవిని కూడా గడ్డిపోచలా విసిరి కొట్టిన ఘనత తనదేనని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎవరు అధైర్య పడొద్దు మనం ఓడిపోయినమని ఎప్పుడు అనుకోవద్దు అంటు అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై పోరాడతానని అన్నారు. నియోజకవర్గ ప్రజలు అతి పెద్ద బాధ్యత అప్పగించినారని కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీ వాగ్దానాలు చేయకపోతే అడుగడుగునా ప్రశ్నించే అవకాశం ఇచ్చి తెలంగాణ ప్రజలు మనకు మేలు చేశారని ఒక ప్రకటనలో తెలియజేశారు.

## నేల సంరక్షణపై అవగాహన

**రామాయంపేట (మెదక్), నేటిధాత్రి:**
ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా రైతులకు నేల సంరక్షణ, భూసార పరిరక్షణ, జీవన ఎరువుల వాడకం, సేంద్రీయ కర్బన పదార్థల పెంపు, మట్టి నమూనా సేకరణ, మృతిక పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాజ నారాయణ మాట్లాడుతూ రైతు యొక్క ఆదాయం పెరిగే క్రమంలో పంటల దిగుబడి ముఖ్య భూమిక పోషిస్తుందని పంటల దిగుబడి సారవంతమైన నేల ఆరోగ్యాన్ని బట్టి ఆధారపడుతుందని రైతుల యొక్క ఆదాయం పెరగాలంటే తప్పనిసరిగా పంటలు దిగుబడి పెరగాలని కానీ ప్రస్తుతం రైతులు పంటల దిగుబడి పెంచే క్రమంలో మోతాదుకు మించి ఎరువుల వాడకం వల్ల భూమి కాలుష్యం చెంది భూమిలోని పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాము లు యొక్క సంతతి క్రమంగా క్షీణిస్తుం దని అదేవిధంగా నేలలో సేంద్రియ కర్బన పదార్థం తగ్గడం వల్ల పంటల దిగుబడి



క్రమక్రమంగా తగ్గుతుందని మోతాదు మించి ఎరువులు వాడడం వల్ల భూమిలో లవణ సాంద్రత పెరిగి మరియు చౌడు పెరిగి దీర్ఘకాలంలో పంటల దిగుబడి పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. పెరుగుతున్న జనాభా తగ్గ ట్టుగా పంటలు దిగుబడి పెంచాలంటే తప్పనిసరిగా నేల ఆరోగ్యాన్ని కాపాడాలి ఇందులో భాగంగానే వేసవి దు, వానకాలంలో పచ్చిరొట్ట పంటల పెంపకం మట్టి నమూనా పరీక్ష చేయించుకోవడం, వాటి ఫలితాలు ఆధారంగా మాత్రమే నియమిత మోతాదులో ఎరువులు వాడుకోవడం రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను వాడటం వంటి దీర్ఘకాలిక సమగ్ర పోషక యజమాన్య పద్ధతులు పాటించినప్పుడే రైతుల యొక్క పంటలు దిగుబడి పెరిగి తద్వారా రైతు యొక్క ఆదాయం పెరిగే అవకాశం ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సతీష్ ,వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయి కృష్ణ, రాజు, తేజస్వి, స్రవంతి, మరియు రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు గొర్రెకుంట విద్యార్థులు

**వరంగల్ జిల్లా (ప్రతినిధి), నేటిధాత్రి:**
ఈ నెల 4న మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టిఆర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బేస్ బాల్ క్రీడా పోటీలకు పాఠశాలల ఎంపిక క్రీడా పోటీలలో గీసుకొండ మండలం 15 వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని వారి క్రీడా ప్రతిభతో రాష్ట్రస్థాయి బేస్ బాల్ పాఠశాలల క్రీడలకు ఎంపికైనట్లు పాటశాల ప్రధానోపాధ్యాయురాలు నలిమెల జ్యోతిర్మయి తెలిపారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బేస్ బాల్ క్రీడా పోటీలకు పాఠశాలల ఎంపిక క్రీడా పోటీలలో తమ పాఠశాలకు చెందిన ఎల్.అన్ను,ఎన్.అభినందన్, ఎల్.రిషి లు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈనెల 8,9,10వ తేదీలలో తొర్రూర్



పట్టణంలో జరుగు రాష్ట్రస్థాయి బేస్ బాల్ పాఠశాలల క్రీడలకు(14సం) ఎంపికయ్యారని చెప్పారు.తమ క్రీడా ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిచిట్లు పేర్కొన్నారు.ముఖ్య అతిథిగా స్థానిక కార్పోరేటర్ ఆకుల మనోహర్,విద్యాకమిటి చైర్మన్ జున్ను కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం షహీన్ సుల్తాన,యం.చంద్రశేఖర్, మార్త.శ్రీనివాన్, సి.హెచ్. అనిత,పి.ప్రణతికుమారి,యం.ప్రభాకర్ ,జె.దమరి ,ఆర్.రాజు, సి.హెచ్. శ్రీదేవి,పిఇటి జె.రఘువీర్ మరియు గ్రామస్థులు ,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలో స్పిక్ సేవలు అభినందనీయం

- జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి...
- రైతులకు పరదాలు, బహుమతుల పంపిణీ...

**మంగపేట-నేటిధాత్రి:**
వ్యవసాయ రంగంలో స్పిక్ ఫర్టిలైజర్స్ కంపెనీ సేవలు అభినందనీయమని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ మెంబర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు మంగళ వారం మంగపేట మండలం అకినేపల్లి మల్లారం వికాస్ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ మరియు సీడ్స్ ఆధ్వర్యంలో స్పిక్ వరంగల్ రీజనల్ మేనేజర్ షేక్ ముల్లా సుభాన్ అధ్యక్షతన నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా నాసిరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ స్పిక్ మరియు గ్రీన్ స్టార్ ఎరువుల సంస్థలు రైతుల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న అనునాతన సాగు పద్ధతులకు అనుగుణంగా వివిధ రకాల సూటి మరియు సూక్ష్మ ఎరువులను యాజమాన్యం అందిస్తోందన్నారు స్పిక్ సంస్థ ప్రవేశపెట్టిన స్పిక్ బోనంజ పథకంలో రైతులందరూ భాగస్వాములై విలువైన బహుమతులు గెలుచుకోవాలని సాంబశివరెడ్డి కోరారు స్పిక్ మరియు గ్రీన్ స్టార్ సంస్థలు రైతుల కోసం ఉచితంగా భూసార పరీక్షలు సాగునీటి పరీక్షలు నిర్వహించటం ఆధునిక సేద్య



పద్ధతులు తెలియటం కోసం గ్రామీణ ప్రాంతాల్లో రైతు సదస్సులు నిర్వహించటం సంతోషకరమన్నారు స్పిక్ వరంగల్ రీజనల్ మేనేజర్ షేక్ ముల్లా సుభాన్ మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా సకాలంలో ఎరువులను తమ స్పిక్ మరియు గ్రీన్ స్టార్ సంస్థలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు ప్రస్తుత రబీ సీజన్ లో స్పిక్ బోనంజ పథకం కింద స్పిక్ జెన్ ఎంపవర్ నరీష్ సూక్ష్మ పోషకాల ఉత్పాదనలపై కూపన్లు అందజేస్తున్నట్లు తెలిపారు ఈ కూపన్ల ద్వారా గెలుపొందిన రైతులకు విలువైన బహుమతులను పంపిణీ చేస్తున్నట్లు సుభాన్ తెలిపారు వికాస్ ఫెర్టిలైజర్స్ ద్వారా అకినేపల్లి మల్లారం మరియు పరిసర ప్రాంత గ్రామాలకు సుమారు పదివేల కూపన్లు అందిస్తున్నామని ఈ ప్రాంత రైతాంగం తమ ప్రత్యేక ఉత్పత్తులను కొనుగోలు చేసి భోనంజ పథకంలో భాగస్వాములు కావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు అనంతరం స్పిక్ మరియు గ్రీన్ స్టార్ ఉత్పత్తులను ప్రదర్శించి బోనంజా పథకంలో విజేతలైన రైతులకు శిల్పాలిన్ పరదాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో స్పిక్ సేల్స్ ఆఫీసర్ శ్రీనివాస్ డెవలప్మెంట్ ఆఫీసర్ పవన్ అకినేపల్లి మల్లారం రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ షేక్ మదర్ సాహెబ్ వీరాపురం కోఆర్డినేటర్ పాడి దామోదర్ రెడ్డి అకినేపల్లి మల్లారం నరసింహసాగర్ దోమెడ టీ కొత్తగూడెం తదితర గ్రామాలను చెందిన సుమారు వందమంది రైతులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన పరుస్తున్న పోలీస్




**గణపురం, నేటిధాత్రి:**
భూపాలపల్లి జిల్లా గణపురం మండల కస్తూర్బా పాఠశాల నందు ఏ హెచ్ టి యు భూపాలపల్లి జిల్లా ఇంచార్జి ఇన్స్పెక్టర్ శ్రీ అజయ్ కుమార్ గారి ఆదేశానుసారం పిల్లల పై జరుగు లయింగిక దాడుల గురించి బాండెడ్ లేబర్, బాలకార్మిక మానవ అక్రమ రవాణా, గంజాయి నివారణ, మహిళల పై జరుగు దాడులు గురించి అవేర్నెస్ ప్రోగ్రాం చేయనైనది, ఏ హెచ్ టి యు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ,కానిస్టేబుల్ శ్రీనాథ్, పాఠశాల హెడ్ మాస్టర్ ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి శుభాకాంక్షలు



కూచూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు

**మహబూబ్ నగర్ జిల్లా, నేటిధాత్రి:**
జడ్చర్ల నియోజకవర్గం నవాబుపేట మండలంలోని కూచూరు గ్రామ యువకులు అసెంబ్లీ ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గం జనంపల్లి అనిరుద్ రెడ్డి ని ఎమ్మెల్యేగా గెలిపించడానికి కార్యకర్తలు నిద్రాహారాలు మాని గ్రామంలో మొత్తం టిఆర్ఎస్ మయంగా ఉన్న గ్రామాన్ని . యువనాయకులు, కూచూరు గ్రామాన్ని టిఆర్ఎస్ కి ఏమాత్రం తగ్గకుండా మనస్పర్ధలు లేకుండా అందరినీ కలుపుకొని కాంగ్రెస్ పార్టీ ని గెలిపించడానికి అహర్నిశలు శ్రమించారు. సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను వివరించి కూచూరు గ్రామంలో కాంగ్రెస్ జెండాని విజయకేతనం ఎగిరే దిశగా కృషి చేశారు.. ఎంతోమంది వెటకారంగా మాట్లాడిన ప్రలోభాలకు లొంగకుండా పనిచేశారు.
గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు అందరి సహకారంతో జనంపల్లి అనిరుద్ రెడ్డి ని గెలిపించుకొని సంబరాలు నిర్వహించారు. నూతన ఎమ్మెల్యే కి అభినందనలు తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో తనేం,సురేష్ అనోక్ సామెల్ పెద్ద శేఖర్. సునీత ,సంతోష్, నర్సింలు గౌడ్, చిట్టి రాజు, ఎస్ యాదయ్య, సర్దార్ కర్రి అశోక్. తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు లక్షెట్టిపేట గురుకుల విద్యార్థుల ఎంపిక

**లక్షెట్టిపేట (మంచిర్యాల), నేటిదాత్రి:**
డిసెంబర్ 3వ తేదీన లక్షెట్టిపేట లోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలుర కళాశాలలో నిర్వహించినటువంటి అండర్ 19 స్కూల్ గేమ్స్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో లక్షిటిపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం. లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 7, 8 ,9 తేదీలలో హనుమ కొండలోని %జీచీూ% స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పీడి పీఈటి మల్లికా మమత తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు వివరాలు ఎం .రశ్మిత- 1500 మీటర్స్ ఎం.మనోహరికా-



100 మీటర్స్ సి.హెచ్. సహస్ర షార్ట్ పుట్ డి. దీపిక హై జంప్ జె.సంజన 400 మీటర్స్ బి .స్వర్ణ విజేత 800 మీటర్స్ కె.కుంకుమ 3%ఖవీ% రన్ లో పాల్గొంటారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ ఎం లలిత కుమారి గారు మరియు వైస్ ప్రిన్సిపల్ కె మహేశ్వర రావు గారు ,అండర్/19 ఎస్ జి ఎఫ్ సెక్రటరీ బాబురావు గారు మరియు కళాశాల ఉపాధ్యాయ బృందం అభినందించడం జరిగింది.

## హెూం మంత్రిగా కొండా సురేఖ?

**వరంగల్ తూర్పు, నేటిధాత్రి:**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న తరుణంలో, నూతన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, ఆర్థిక మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్లు దాదాపు ఖరారు అయినట్లే కనిపిస్తోంది. ఈ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి గతంలోనే మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కొండా సురేఖకు హెూం మంత్రి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొండా దంపతులకు ఢిల్లీ లెవెల్ లో పరిచయాలు ఉండటం కూడా కలిసి వస్తుంది అనే చెప్పొచ్చు. ఏది ఏమైనా కొండా సురేఖ హెూం మినిస్టర్ కావాలనే కోరిక కొండా అభిమానుల్లో బలంగా వినిపిస్తుంది. గతంలోనే వైఎస్ హయాంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉండటం, ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి గెలిచిన మహిళల్లో సీనియర్ నాయకురాలు కావడం, గెలిచిన వాళ్ళలో కొండా సురేఖకు మాత్రమే మాజీ మంత్రిగా చేసిన అనుభవం ఉంది కనుక కొండా సురేఖ హెూంమంత్రి అయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది.



ఉమ్మడి వరంగల్ జిల్లాకు హెూంమంత్రి వచ్చే అవకాశం ఉందని, అందులో వరంగల్ తూర్పు నుండి గెలిచిన కొండా సురేఖకు హెూంమంత్రి వస్తుందని కొండా అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు..

## శేరిలింగంపల్లి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటా



**కూకట్పల్లి, నేటిధాత్రి:**
కాంగ్రెస్ పార్టీ నా మీద నమ్మకం ఉంచి ఒక్క నెలలోనే నాతో నడిచి ఒక లక్ష తొమిది వేల తొమిది వంద ల ముప్పై (109 930) ఓట్లు వేసి న న్ను కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన శేరిలింగంపల్లి ప్రజానీకానికి ఎల్లవేళ లా రుణపడి ఉంటాం. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభి వృదే ప్రధాన లక్ష్యంగా,బడుగు బల హీన వర్గాల ప్రజలకు సేవ చేయాల నే ఆశయాన్ని బలం చేకూర్చే విధంగా నా వెంట నడిచిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల కు,నాయకులకు, అభిమానులకు ధన్యవాదాలు. మంగళవారం రోజు మియపూర్ విశ్వనాథ గార్డెన్ నందు ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ కార్య కర్తల సమావేశంలో పాల్గొని కార్యక ర్తలకు భరోసాను అందించారు శేరి లింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వి.జగ దీశ్వర్ గౌడ్. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చే సుకోవడం చాలా సంతోషంగా ఉంద ని,టీపీసీసీ అధ్యక్షులు శ్రీ.రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఈరోజు రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ జెండా రెపరే పలాడుతుందని,కాంగ్రెస్ పార్టీ ప్రక టించిన సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకువెళ్లేలా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికలలో గెలుపోటములు సహజం,ప్రజాతీర్పును గౌరవిస్తాం,నా వెంట నడిచిన నియోజకవర్గ ప్రజా నీకానికి ధన్యవాదాలు తెలిపారు,శేరిలింగంపల్లి ప్రజాలతోనే ఉంటాం,ప్రజాలకోసమే పని చేస్తానని తెలిపారు.ఈ కార్యక్ర మంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ డివిజన్అధ్యక్షులు,నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుంది



**మందమర్రి, నేటిధాత్రి:**
సింగరేణి కార్మికుల ప్రతి సమస్యను యాజమాన్యంతో కొట్లాడి సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, సింగరేణి కార్మికులు సిఐటియు యూనియన్ ను గెలిపించాలని సిఐటియు డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ కోరారు. మందమర్రి ఏరియా కళ్యాణిఖని 5వ గనిపై వడ్లకొండ శివ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకున్నట్టే సింగరేణి యూనియన్ ఎన్నికల్లో మార్పు కోసం సిఐటియు యూనియన్ ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఏరియాలో గెలిచిన టిబిజికేఎస్ యూనియన్, ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన ఏఐటియుసి యూనియన్ సంఘాలు యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, నిస్వార్ధంగా కార్మికుల క్షేమం కోరుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి సిఐటియు పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఏఐటియుసి వల్ల క్వార్టర్స్ లేని కార్మికులకు చెల్లించే ఇంటి కిరాయిని ఆపేసిన విషయాన్ని గ్రహించి వారికి ఇంటి కిరాయి ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామని, అక్టింగ్ ప్రమోషన్లు, సర్ఫేస్ మజ్దూరు, గనులకు వచ్చే రోడ్ల రిపేరు కోసం యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించడంలో విజయవంతమయ్యామని తెలిపారు. క్వార్టర్స్, ప్రమోషన్లు, డిప్యూటేషన్ల పనుల కోసం రెండు యూనియన్లు కార్మికులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఏరియాలో ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతున్న సిఐటియు సూర్యుని గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ సంకే వెంకటేష్, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, అలవాల సంజీవ్, ఆర్గనైజర్ లు దొండ నవీన్, ఆదర్శ్, చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటిధాత్రి
మన నేటిధాత్రి వార్త దినపత్రిక అక్షర ప్రయాణం మొదలు పెట్టి
18 ఏళ్లు పూర్తి చేసుకొని 19 వసంతంలో అడుగిడిన
శుభ సందర్భాన పాఠకులకు,ప్రకటన కర్తలకు,
శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు
మీ ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని విజ్ఞప్తి.
-ఎడిటర్
ANNIVERSARY 19 YEAR
19 ఏళ్ల వసంతం



## ఢిల్లీ నివాసం ఖాళీకి

# కేసీఆర్ ఆదేశాలు

### ప్రగతిభవన్ నుంచి ఖాళీ చేస్తున్న అధికారులు



**హైదరాబాద్,నేటిధాత్రి:**
ప్రగతి భవన్ ను ఖాళీ చేస్తున్న తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఢిల్లీలోని అధికారిక నివాసాన్ని కూడా ఖాళీ చేస్తున్నారు. ముఖ్యమంత్రులకు ఢిల్లీలో ఓ అధికారిక నివాసం కేటాయిస్తారు. ఎంపీగా ఉన్నప్పుడు కేటాయించిన ఇంటినే.. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా కొనసాగిస్తున్?రు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా కూడా రాజీనామా చేసినందున ఆ ఇంటిని పార్లమెంట్ కు అప్పగించాల్సి ఉంది. ఢ ఃల్లీకి ఎప్పుడు వెళ్లినా తుగ్లక్ రోడ్డులోని ఇంట్లో కేసీఆర్ ఉంటారు. ఎంపీగా ఓడిపోయిన తర్వాత కవిత కూడా ఢిల్లీ ఎప్పుడు వెళ్లినా ఆ ఇంట్లోనే ఉంటారు. రెండు దశాబ్దాలుగా దేశ రాజధాని ఢిల్లీలో కేసీఆర్ అధికారిక నివాసంగా ఉంది. 2004 నుండి ఢిల్లీలోని తుగ్లక్ రోడ్‌లోని ఇల్లు అప్పట్లో కేసీఆర్ ఎంపీగా ఉన్నప్పటి నుండి అధికారిక నివాసంగా ఉంది. ఆ తర్వాత సీఎంగా ఉన్న సమయంలో ఆ ఇంటిని అధికారిక నివాసంగా ఎంచుకున్నారు. ప్రస్తుతం తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. రాష్ట్రంలో గెలిచిన తర్వాత కేసీఆర్ రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. సీఎం హోదాలో హస్తినకు వచ్చినప్పుడల్లార ఇదే ఇంట్లోనే ఉండేవారు. అధికారం కోల్పోయిన ఏ ప్రజాప్రతినిధి అయినా తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేయడానికి ఒక నెల
సమయం ఉంటుంది. కానీ, కేసీఆర్ ఆదేశాల మేరకు రెండు మూడు రోజుల్లో ఇల్లు పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ఆ ఇల్లు ఖాళీగా ఉంటే రెండు దశాబ్దాలుగా ఈ ఇంటితో కేసీఆర్‌కు ఉన్న సంబంధం తెగిపోతుంది. 2004లో టీఆర్ఎస్ తరపున కరీంనగర్ నుంచి ఎంపీగా ఎన్నికై మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో కార్మిక శాఖ మంత్రిగా కేసీఆర్ పనిచేశారు. ఆ సమయంలో కేంద్ర మంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు తుగ్లక్ రోడ్డులోని టైప్ 8 క్వార్టర్‌ను కేటాయించింది. 2006లో కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన కేసీఆర్.. ఉప ఎన్నికల్లో ఎంపీగా గెలిచి అదే సభలో కొనసాగారు. 2009లో మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన అదే నివాసంలో ఉంటున్నారు. 2014లో తెలంగాణ సీఎం అయిన కేసీఆర్.. ముఖ్యమంత్రులకు ఢిల్లీలో అధికారిక నివాసాలను కేటాయిస్తుంది కేంద్ర ప్రభుత్వం. ఇందులో భాగంగా అదే నివాసాన్ని కేసీఆర్ కు కేటాయించారు. అదే సమయంలో కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్ ఎంపీగా గెలుపొందారు. ఆమె ఆ నివాసాన్ని తన అధికారిక నివాసంగా కూడా ఎంచుకుంది. ఆ క్వార్టర్ ముఖ్యమంత్రి, ఎంపీ కవితకు అధికారిక నివాసంగా మారింది. 2018లో కేసీఆర్ రెండోసారి సీఎం అయిన తర్వాత అదే నివాసంలో కొనసాగారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండబోతున్న సమయంలో కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారిక భవనాలను ఖాళీ చేయాల్సిందే. ఇప్పటికే పలువురు మంత్రులు, ఓడిపోయిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ అధికారిక భవనాలను ఖాళీ చేస్తున్నారు. క్యాంపు కార్యాలయాల్లోనే తమ సామాగ్రిని తరలిస్తున్నారు. సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్‌ను కూడా కేసీఆర్ ఖాళీ చేస్తున్నారు.

# కొనసాగుతున్న రాజీనామాలు

### చింతా ప్రభాకర్, రావుల శ్రీధర్ రెడ్డిలు రాజీనామా





**హైదరాబాద్,నేటిధాత్రి:**
తెలంగాణలో నామినేటెడ్ పదవులకు రాజీనామాలు కొనసాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి మంగళవారం చింతా ప్రభాకర్ రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపారు. మొన్నటి ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ గెలుపొందారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు కార్పొరేషన్ల చైర్మన్లు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి పంపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమం మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవికి రావుల శ్రీధర్ రెడ్డి రాజీనామా చేశారు. మంగళవారం తన రాజీనామా లేఖను చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 21 నెలలు పాటు టీఎస్ఈడబ్ల్యూఐడీసీ సంస్థ ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండేళ్లలో రాష్ట్రంలో అనేక విద్యాలయాలు, సంక్షేమ భవనాల నిర్మాణాలను భవిష్యత్ తరాలకు అందించడంలో సంస్థ ద్వారా చేసిన కృషి ఒక మంచి అనుభూతిని మిగిల్చిందన్నారు. అలాగే పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అన్ని సదుపాయాల నడుమ అందించాలనే సంకల్పంతో పుట్టిన కేసీఆర్ మానసపుత్రిక మన ఊరు –మన బడి కార్యక్రమంలో భాగంగా వాటి పనుల పర్యవేక్షణ కోసం జిల్లాల పర్యటనలో జిల్లా స్థాయి ఉన్నతాధికారుల నుంచి మండల, గ్రామ స్థాయి అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి పనిచేయడం ఒక మంచి అనుభవాన్ని మిగిల్చిందన్నారు. విధి నిర్వాహణలో తనకి అండగా ఉన్న కేటీఆర్ హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# పార్లమెంట్‌లో ప్లకార్డుల ప్రదర్శన నిషేధం


♦ ఎవరైనా అలాచేస్తే చర్యలు తీసుకుంటాం ♦ ఎంపిలను హెచ్చరించిన స్పీకర్ ఓంబిర్లా



**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
లోక్‌సభలో ప్లకార్డులు తీసుకుని రావొద్దని.. సభలో గౌరవం, క్రమశిక్షణను కొనసాగించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు హెచ్చరిక జారీ చేశారు. ప్లకార్డులు సరికాదన్నారు. ఇది పార్లమెంట్రీ వ్యవహారాలకు తగదన్నారు. ఒకవేళ ఎవ్వరైనా ప్లకార్డులు తీసుకొస్తే మాత్రం.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. తనపై కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ ఎంపీ రమేశ్ బిధురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. బీఎస్పీ సభ్యుడు డానిష్ అలీ పార్లమెంట్ ఎదుట ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే.. స్పీకర్ ఓంబిర్లా ఎంపీలను ఈ మేరకు హెచ్చరించారు. సోమవారం డానిష్ అలీ తన మెడకు ప్లకార్డు వేలాడదీసుకుని పార్లమెంట్ బయట నిరసన వ్యక్తం చేశారు. తనని బీజేపీ ఎంపీ రమేశ్ బిధురి కించపరిచే
వ్యాఖ్యలు చేశారని.. అగౌరవ పరిచారని అందులో రాసి ఉంది. కాబట్టి.. ఆయనపై చర్యలు తీసుకొని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి స్పీకర్ ఓంబిర్లా దృష్టికి తీసుకెళ్లాలి. ప్లకార్డును తొలగించాలని డానిష్ అలీని సూచించాలని ఆయన అభ్యర్థించారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఓంబిర్లా స్పందిస్తూ.. సోమవారం జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ మీటింగ్‌లో కొత్త పార్లమెంట్ హౌస్‌లో ప్లకార్డులు తీసుకురాబోమని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. పార్లమెంట్‌లో గౌరవం, క్రమశిక్షణ పాటించాలని అందరికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఒకవేళ ప్లకార్డులు తీసుకొస్తే.. ఆ ఎంపీలపై చర్యలు తీసుకుంటా అని ఓంబిర్లా చెప్పుకొచ్చారు. ప్లకార్డులతో సభకు రావడం పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమని, బీఎస్పీ ఎంపీ డానిష్ అలీని వెంటనే సభ నుంచి బయటకు వెళ్లాలని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. సభ నిబంధనలను ఉల్లంఘించవద్దని ప్రతి సభ్యునికీ విజ్ఞప్తి చేశారు. అందరూ సంయమనం కొనసాగించాలని, సానుకూల మనస్సుతో రావాలని ఆశిస్తున్నానని చెప్పారు. అయితే.. స్పీకర్ మాటల్ని పట్టించుకోకుండా రమేష్ బిధూరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డానిష్ అలీ తన నిరసనలను కొనసాగించారు. దీంతో స్పీకర్ సహనం కోల్పోయారు. ప్లకార్డులతో సభకు రావడానికి ఎవరినీ అనుమతించనని తెగేసి చెప్పారు. అనంతరం సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

# రైల్వే ప్రయాణికులకు అలెర్ట్

### తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని ట్రైన్స్‌ను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే..!




**హైదరాబాద్,నేటిధాత్రి:**
దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను మిగ్‌జాం తుఫాను కారణంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాపాతం నమోదవుతున్నది. వానల నేపథ్యంలో రవాణా వ్యవస్థపై భారీగా ప్రభావం చూపుతున్నది. తుఫాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే పెద్ద ఎత్తున రైళ్లను రద్దు చేసింది. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో నడిచే రైళ్లను రద్దు చేసింది. ఇతర రాష్ట్రాల మీదుగా నడిచే పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారిమళ్లించింది.
ఈ మేరకు ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ నెల 6న గుంటూరు–రేపల్లె (07784), రేపల్లె %--% గుంటూరు (07785), గుంటూరు–రేపల్లె (07786), రేపల్లె -- తెనాలి (07873), తెనాలి–రేపల్లె (07874), రేపల్లె–తెనాలి (07875), తెనాలి–రేపల్లె (07876), రేపల్లె–గుంటూరు (07787) రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొంది. అలాగే మంగళవారం నడవాల్సిన తెనాలి – రేపల్లె (07888), గుంటూరు–తెనాలి (07887) రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. అలాగే, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ -- ముంబయి ఎల్‌టీటీ (12164) రైలును చెన్నై సెంట్రల్ – తిరుత్తని మధ్య రద్దు చేసినట్లు చెప్పింది.
కాచిగూడ–రేపల్లె (17625) రైలును గుంటూరు–రేపల్లె మధ్య రద్దు చేసినట్లు పేర్కొంది. బుధవారం నడవాల్సిన రేపల్లె -- మార్కాపురం (07889) రైలును రేపల్లె గుంటూరు మధ్య, సికింద్రాబాద్ -- రేపల్లె (17645) రైలును గుంటూరు – రేపల్లె, రేపల్లె సికింద్రాబాద్ (17626) రైలు రేపల్లె –గుంటూరు మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు చెప్పింది. ఇక చెంగల్‌పట్టు %--% కాచిగూడ (17651) రైలును దారి మళ్లించినట్లు పేర్కొంది. కంచీపురం–మేల్పాక్కం క్యాబిన్ మీదుగా మళ్లించినట్లు తెలిపింది. తాంబరం, చెన్నై ఎగ్మోర్, అరక్కోణం స్టేషన్లలో ఆగదని వివరించింది.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి సంపూర్ణ

# సహకారాన్ని అందిస్తాం

**హైదరాబాద్,నేటిధాత్రి:**
నూతనంగా ఏర్పడనున్న రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) కేంద్ర సంఘం అభినందనలు తెలిపింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం హర్షం వ్యక్తంచేస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పది లక్షల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం కలిసి పనిచేస్తామన్నారు.
రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్యోగులుగా ప్రభుత్వంతో కలిసి సమన్వయం చేసుకుని ముందుకెళతామన్నారు. ఉద్యోగుల ఆకాంక్షల మేరకు నూతన ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పలు అనుకూల నిర్ణయాలను ప్రకటించిందని, ఆయా మ్యానిఫెస్టో అమలుకోసం, ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. నూతన ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయటంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ముందుంటామని జగదీశ్వర్‌తో పాటు టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేని తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు.

## జైపూర్‌లో

# దారుణ హత్య

➤ రాజ్‌పుత్ కర్ని సేన అధ్యక్షుడిపై కాల్పులు
➤ ఆస్పత్రికి తరలిస్తుండగా సుఖ్‌దేవ్ సింగ్ గోగామేడీ మృతి



**జైపూర్,నేటిధాత్రి:**
రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ని సేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గోగామోడీని దుండగులు కాల్చిచంపారు. దుండగులు ఆయన ఇంట్లోకి చొరబడి ఆయనపై కాల్పులు జరిపినట్టు ప్రాథమిక సమాచారం. తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు, సీనియర్ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. సుఖదేవ్ సింగ్‌ను చంపుతామంటూ గతంలో లారెన్స్ విష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన సంపత్ నెహ్రా నుంచి పోలీసులకు బెదరింపు కాల్స్ వచ్చాయి. ఘటన జరిగిన వెంటనే భారీగా పోలీసులు బలగాలను శ్యామ్‌నగర్ ప్రాంతంలో మోహరించారు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. గన్‌మెన్ నరేంద్రపై కూడా దుండగులు కాల్పులు జరిపినట్టు చెబుతున్నారు. అయితే సుఖ్‌దేవ్ సింగ్‌పై అగంతకులు ఎన్ని రౌండ్లు కాల్పులు జరిపారనేది తెలియాల్సి ఉంది. రాష్ట్రీయ కర్ని సేనతో చాలాకాలంగా సుఖ్‌దేవ్ సింగ్‌కు అనుబంధం ఉంది. కొద్దికాలం క్రితం కర్నిసేనతో విభేదాలు రావడంతో ఆయన రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ని సేన పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేశారు. బాలీవుడ్ చిత్రం పద్మావత్, గ్యాంగ్‌స్టర్ ఆనంద్ పాల్ ఎన్‌కౌంటర్ కేసు తర్వాత రాజస్థాన్‌లో జరిగిన పలు ధర్నాలతో ఆయన పేరు బాగా ప్రచారంలోకి వచ్చింది. ఈ అంశాలకు సంబంధించిన పలు వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. మరోవైపు, సుఖ్‌దేవ్ సింగ్ గోగామేడిని ఆగంతకులు కాల్చిచంపిన ఘటనపై కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని పోలీస్ కమిషనర్‌ను కోరినట్టు చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, బీజేపీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టగానే రాష్ట్రాన్ని నేరాల నుంచి విముక్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. సుఖ్‌దేవ్ సింగ్ ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు భగవంతుడు ఆత్మనిబ్బరం కలిగించాలని కోరుకుంటున్నట్టు ఆయన ట్వీట్ చేశారు.

# పాగాల సంపత్‌కు కేటీఆర్ నివాళి

♦ సంపత్ మరణం పార్టీకి తీరని లోటని వ్యాఖ్య
♦ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ



**జనగామ,నేటిధాత్రి:**
బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పార్థివదేహానికి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సంపత్‌రెడ్డి అకాల మరణం కలిచివేసిందని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సంపత్‌రెడ్డి (55) సోమవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. హనుమకొండలోని తన నివాసంలో గుండెపోటు రావడంతో కుప్పకూలి పోయారు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రాజయ్య తదితరులు ఉన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సంపత్ రెడ్డి మృతికి నివాళి అర్పించారు.

# మోడీలో ఆత్మవిశ్వాసం

♦ ఇక తనకు తిరుగులేదన్న భావనలో ప్రధాని
♦ ప్రధాన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలం
♦ ప్రజలకు ప్రతికూలంగా మారిన ఆర్థిక విధానాలు




**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి దాదాపు తొమ్మిన్నరేళ్లు పూర్తి కావస్తోంది. మరోమారు అధికారం తమదే అన్న ధీమాలో ఉన్నారు. ఇటీవలి ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో అధికారం దక్కడంతో తిరుగలేని నేతగా ఎదిగారు. తెలంగాణలో కూడా ప్రభుత్వం వచ్చే క్రమంలో వేసిన వెనకడుగు, తప్పటడుగుల వల్ల ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. కెసిఆర్‌తో లోపాయకారి ఒప్పందం కాస్తా తెలంగాణలో బిజెపి ఎదుగుదలకు బ్రేక్ వేసింది. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో 8 సీట్లు రావడంతోనూ తమకు తిరుగులేదన్న రీతిలో బిజెపి నేతలు ఉన్నారు. ప్రధాని మోడీ కూడా అంతకుమించి ఆత్మవిశ్వాసం తో ఉన్నారు. కేంద్రమంత్రులు ఎందరు ఉన్నా వారంతా డమ్మీలే. అంతేగా కుండా అంతా నమో అంటూ స్మరించే స్థాయికి చేరుకునేలా చేశారు. తనకంటూ ఒక ప్రత్యేక అభిమాన భక్తగణాన్ని దేశవిదేశాల్లో రూపొందించుకోవడంలోనూ మోడీ విజయం సాధించారు. అందుకే మోదీని తీవ్రంగా విమర్శిం చేవారిని మించి ఆయనను గుడ్డిగా సమర్థించే వారు ఎక్కువగా ఉన్నారు. భారతీయ జనతా పార్టీకి బలం తానే అన్న రీతిలో ఇప్పుడు పార్టీ పరిస్థితి తయారయ్యింది. మోదీ, ఆయన విధానాల పట్ల వ్యతిరేకత పెరుగుతున్నా దానిని ఆయన లెక్క చేయడం లేదు. ఆర్థిక విధానాలు సవ్యంగా ఉన్నాయని, ధరలు అదుపులో
ఉన్నాయని, నిరుద్యోగం నియంత్రణలో ఉన్నదని చెప్పేందుకు విపరీతమైన ప్రచారాలు వివిధ రూపాల్లో సాగుతున్నాయి. మోదీ నిరంకుశ, ఏకపక్ష విధానాల వల్ల దేశ సమస్యలే కాదు..ఉభయ తెలుగు రాష్ట్రాలకు కూడా సమీప దూరంలో పరిష్కారం అవుతాయనడానికి లేదు. ప్రధానమంత్రి సమాఖ్య స్ఫూర్తితో పనిచేస్తున్నారనడానికి లేదు. రాష్ట్రాలను గౌరవిస్తున్నానని చెప్పుకోవడం మినహా వారిని గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నాలు ఎప్పుడూ కొనసాగిస్తుంటారు. మోదీ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు కేంద్ర ఏజెన్సీలను అప్పుడప్పుడూ ప్రయోగి స్తూనే ఉంటారు. ఇలాంటి ఆలోచనా ధోరణితో ఉన్న నేత మోడీ. ఇకముందు కూడా ఇలాగే ఉంటారు. తను చేయాలనుకున్నదే చేస్తారు. చెప్పదల్చుకున్నదే చెబుతారు. నోట్లరద్దు బాధలు, జిఎస్టీ వాతలు, పెట్రోదరల బాధలు, గ్యాస్ మంటలు అయనకు పట్టవు గాక పట్టవు. అలాగే దేశ ప్రజల సమసల్యు పెద్దగా పట్టించుకోరు. అలాగే ఉభయ రాష్ట్రాల సమస్యలను కూడా పట్టించుకుంటారన్న నమ్మకం కూడా లేకుండా పోయింది. అందుకు ఈ పదేళ్ల కాలమే నిదర్శనం. మరోవైపు
ప్రజలు స్వేచ్ఛగా బతికే అవకాశం లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోంది. మోడీ తాను కోరుకున్న విధంగా తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో కృతకృత్యులు అయ్యారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలినా అది వారి దృష్టిలో పడడం లేదు. పద్దా అదో సమస్యగా చూడడం లేదు. ఇకపోతే ధరలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు. పెట్రో ధరలపై అదుపు లేకుండా పోతోంది. సామాన్యులకు కిరోసిన్, చక్కెర కోటాలు బంద్ చేశారు. పార్టీలో చర్చ అన్నది లేకుండా తక్షణ నిర్ణయాలు తీసుకుని అమలు చేసేలా మోడీ పాలనా వ్యవస్థ సాగుతోంది. మోడీ వచ్చాక బిజెపిలో ఏకవ్యక్తి నిర్ణయాలకు బీజం వేశారు. ప్రధానిగా నరేంద్రమోడీ తాను అనుకున్న విషయాలను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు వాటిని ప్రజలపై గట్టిగానే రుద్దుతున్నారు. అలా రుద్దుతున్న విషయాలనే తాను సాధించిన విజయాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత లేదా ప్రజల జీవితాల్లో మార్పులు గోచరించాయా లేదా అన్న విషయాలను వదిలేసి, తాము చేసిన నిర్ణయాలను ప్రజలపై రుద్ది ఆనందిస్తున్నారు. పదేళ్ల యూపిఎ పాలన నుంచి ప్రజలు కోరుకున్న విముక్తి లభించలేదు కదా కొత్త సమస్యలు చుట్టుకున్నాయి. రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. సరికదా
పుట్టుకనుంచి చావువరకూ ఆధార్‌తో అనుసంధానించే పని సాగుతూనే ఉన్నది. ఉన్న చట్టాలను సవరిస్తూ, కొత్త నిబంధనలు తెస్తూ ప్రభుత్వం మొండిగా పోతున్నది. ఆధార్‌లోని ప్రతి వివరం అత్యంత కీలకమై, కోట్లాదిమంది జీవితాలతో ముడిపడి ఉన్నప్పుడు ముందుగా వాటిని సాధ్యమైనంత ప్రక్షాళించేందుకు ప్రభుత్వం ప్రయత్నించివుంటే బాగుండేది. మొత్తంగా ఒక్కొక్కటిగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలన్నీ మోడీ ఆలోచనలే తప్ప ఉమ్మడి ఆలోచనలు లేదా ఉమ్మడిగా చర్చించి తీసుకున్న నిర్ణయాలు కావు. రెండుపూటలా తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసకుంటే అదే మేలు. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించకపోవడం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేపందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది.

## సీఎం ప్రమాణస్వీకారోత్సవ

# ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



**జైపూర్,నేటిధాత్రి:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సీఎం, మంత్రి మండలి ప్రమాణస్వీకారోత్సవ ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసును ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, అగ్నిమాపక శకటాలను వేదిక వద్ద ఉంచాలని, వేదికను శుభ్రపరచడం, తాగునీరు ఫాగింగ్ చేయడం వంటివి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు.
ఎల్‌బీ స్టేడియం వద్దకు వెళ్లే రహదారుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అన్ని సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధనశాఖ అధికారులకు సూచించారు.
సమావేశంల డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, సునీల్ శర్మ, ప్రిన్సిపల్ సెక్రెటరీలు రిజ్వీ, శైలజా రామయ్యర్, గవర్నర్ సెక్రెటరీ సురేంద్ర మోహన్, జీఏడీ సెక్రెటరీ శేషాద్రి, సెక్రెటరీ ఆర్‌అండ్‌బీ శ్రీనివాస్ రాజు, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ హాజరయ్యారు.



# తుపాన్ మిచాంగ్ ముంచేస్తుంది

- తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో కుండపోత
- భారీ వర్షాలతో పొంగుతున్న వాగులు వంకలు
- ధాన్యం తడవకుండా అధికారుల చర్యలు
- పలుచోట్ల ధాన్యం కొనుగోళ్లు చేపట్టిన అధికారులు
- సహాయక చర్యల్లో అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు

- తుఫాన్ ధాటికి నేలకొరిగిన చెట్లు
- కూలిన కరెంట్ స్తంభాలు..పలుచోట్ల విద్యుత అంతరాయం
- కొట్టుకు పోయిన గుడిసెలు..నీటమునిగిన పంటలు
- తీరప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**విశాఖపట్నం/విజయవాడ,నేటిధాత్రి:**
తుఫాన్ మిచాంగ్.. తీరం దాటింది. చీరాల, బాపట్ల మధ్య.. తీరం దాటింది. తీరం దాటే సమయంలో 110 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచాయి. గాలుల తీవ్రతకు చెట్లు కూలిపోయాయి.. విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగిపోయాయి. కరెంట్ సరఫరా నిలిచింది. తీరానికి 10 కిలోమీటర్ల పరిధిలోని ఉన్న గ్రామాల్లోని పూరిళ్లు కూలిపోయాయి. తీరం సమీపంలో.. రోడ్లపై ఉన్న చిన్న తాత్కాలిక దుకాణాలు ఈదురుగాలులకు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. వందల సంఖ్యలో రైలు సర్వీసులను రద్దు చేశారు అధికారులు. మచిలీపట్నం నుంచి చెన్నై వరకు సముద్రం 30 మీటర్లు ముందుకు వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నెల్లూరు, కావలి మధ్య తీరాన్ని తాకిన మిచాంగ్ తుఫాన్.. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బాపట్ల, చీరాల మధ్య తీరాన్ని దాటింది. తీరం దాటిన సమయంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు తీవ్ర నష్టం వచ్చింది. తుఫాను ప్రభావంతో ప్రకాశం, గుంటూరు, కృష్ణ, వెస్ట్ గోదావరిలో, విశాఖ ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై, నెల్లూరు జిల్లాలో గాలుల తీవ్రత కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ వర్షాలు కొనసాగనున్నాయి. తుఫాను ఉత్తర దిశగా నెమ్మదిగా ముందుకు కదులుతోంది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుండి 100 కిలోమీటర్లు కొన్నిసార్లు 110 కిలోమీటర్లు గాలులు వీచనున్నాయి. ముంపు ప్రాంతాల్లో సముద్రం కూడా ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని.. అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్ళకూడదని హెచ్చరించారు. ఇటు రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లో కూడా వర్షాలు ఓ మోస్తారుగా కురుస్తున్నాయి. మరో 24 గంటల పాటు వర్షాలు కొనసాగనున్నాయి.

తుపాను దృష్ట్యా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులపై సీఎం జగన్ ఆరా తీశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి సాయి ప్రసాద్, సీసీఎల్‌ఏ సెక్రటరీ ఇంతియాజ్, సీఎంఓ అధికారులతో సీఎం జగన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ' బాధితులకు మంచి సదుపాయాలు అందించాలి. సౌకర్యాల కల్పనలో ఎలాంటి పొరపాట్లు రాకుండా చూడాలన్నారు. నెల్లూరు, తిరుపతి సహా తుపాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో కరెంటు సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలి. మనుషులు, పశువులు మరణించినట్టు సమాచారం అందితే 48 గంటల్లోగా పరిహారం అందించాలి. తుపాను తగ్గిన వెంటనే ఎన్యుమరేషన్ కూడా ప్రారంభం కావాలి. గ్రామ, వార్డు సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను వాడుకుని రేషన్ పంపిణీ సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు. చీరాల, బాపట్ల మధ్య పయనించి అక్కడ పూర్తిగా తీరం దాటనుందని సీఎంకు అధికారులు వివరించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో తుపాను ప్రభావం ఈ ఉదయం నుంచి క్రమంగా తగ్గుముఖం పడుతోందని, ఆ జిల్లాల్లో సహాయ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. అదే సమయంలో ప్రకాశం, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల కలెక్టర్లనూ అప్రమత్తం చేశామన్నారు. ఇప్పటివరకూ 211 సహాయ శిబిరాల్లో సుమారు 9,500 మందిని తరలించినట్లు అధికారులు వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లోనూ తుఫాన్ ఎఫెక్ట్ ఉంది. ఏపీలోని 10 జిల్లాల్లో కుండపోత వర్షాలు పడుతున్నాయి. రాబోయే 24 గంటలు అంటే..బుధవారం రాత్రి వరకు తుఫాన్ ప్రభావం ఉంటుందని.. అతి భారీ వర్షాలు పడతాయని ప్రకటించింది వాతావరణ శాఖ. ఇప్పటికే బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వాగులు, నదులు పొంగి పొర్లుతున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మిగ్‌జాం తుపాను ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఒంగోలుకు 25 కి.మీ, బాపట్లకు 60 కి.మీ, మచిలీపట్నానికి 130 కి.మీ దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉన్నట్లు అధికారులు తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని చెప్పారు. తుపాను తీరం దాటి సమయంలో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, ఇప్పటివరకూ 211 సహాయక శిబిరాల్లో 9,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో నెల్లూరు, బాపట్ల, ప్రకాశం సహా 11 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

తుపాన్ కారణంగా తీరప్రాంతాల్లో ఈదురు గాలులతో చాలా చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉదయం 6.30 గంటల వరకు బాపట్లలో 21.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా, నెల్లూరు 28.95, మచిలీపట్నం 14.93, కావలి 14.26, ఒంగోలు 11.44, కాకినాడ 5.9, నర్సాపూర్ 5.85, అనకాపల్లి 3.35, పొదలకూరు 20.75, రేప్లలె 1.17, చిత్తూరు 1.25, నర్సారావుపేట 1.15 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో ఇప్పటికే నిజాంపట్నం హార్బర్ లో అధికారులు పదో నెంబర్ హెచ్చరిక జారీ చేశారు. తీర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా, గడిచిన 20 సంవత్సరాల్లో నిజాంపట్నం హార్బర్ లో పదో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేయడం ఇదే మొదటిసారి. ప్రకాశం జిల్లాలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చినగంజాం మండలంలో 15 గంటలుగా విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొల్లూరు మండలం తోకలవానిపాలెంలో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది. తీవ్ర గాలులతో పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. తూర్పుగోదావరి జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజమహేంద్ర వరం, రాజానగరం, అనపర్తి, మండపేట, రామచంద్రపురం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, అమలాపురం మండలాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. కాకినాడ, పిఠాపురం, పెద్దాపురంలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జగ్గంపేట, పత్తిపాడు, తుని మండలాల్లో ఈదురుగాలులతో వరిపంట నేలకొరిగింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, ఇతర పంటలు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల్లూరు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తాయి. 9 మండలాల్లో ఈదురు గాలులతో భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నెల్లూరు, కావలి, కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వాన కురుస్తోంది. వర్షం, ఈదురుగాలులతో చలి తీవ్రత పెరిగిపోయింది.

విజయవాడలో రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో ఇంద్రాకీలాద్రి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు జలమయమయ్యాయి. కృష్ణా జిల్లా దివిసీమలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాగాయలంక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వేల ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. పంట పొలాల్లోకి నీరు చేరడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక తిరుమలలోని గోగర్భం, పాపవినాశనం జలాశయాలు పూర్తిగా నిండిపోయాయి. దీంతో ఒక్కో గేటును ఎత్తి టీటీడీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు.

# తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో కుండపోత

**విజయవాడ,నేటిధాత్రి:**
రాష్ట్రంలో మిచౌంగ్ తుపాను ప్రభావంపై అప్రమత్తంగా ఉన్నట్లు చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారని అన్నారు. తుపాన్ కారణంగా నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అత్యధికంగా వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నూ వర్షపాతం నమోదు అవుతోంది. 8 జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను పంపారు. బుధవారం సాయంత్రం వరకు వర్షాలు కురుస్తాయని అంటున్నారు. సాయం ఓణ 22 కోట్లు తక్షణ చర్యలు కోసం విడుదల చేశామని సిఎస్ తెలిపారు. లక్ష టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. 4 లక్షల టన్నుల ధాన్యాన్ని తడవకుండా చర్యలు తీసుకున్నాం. 11 వేల మంది పునరావాస కేంద్రాల్లో ఉన్నారు. అందరికి ఆహారం, నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందిస్తున్నాం అన్నారు. తుపాను ప్రభావంతో కలిగే నష్టాన్ని వెంటనే అంచనా వేసి కేంద్రానికి పంపిస్తాం అన్నారు. వర్షాలు అధికంగా ఉన్న చోట పాఠశాలలకు సెలవు ప్రకటిం చామని, ఇప్పటివరకు ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెనాలి మండలం ఖాజీపేట, కొలకలూరు లో మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయాధి కారి నున్న వెంకటేశ్వర్లు సందర్శించారు. ప్రత్తిపాడులో పొంగుతున్న ప్రత్తిపాడు-గొట్టిపాడు మధ్యనున్న లోలెవల్ చప్టా వద్ద పోలీసుల పహారా కాసారు. ప్రయాణీకుల భద్రత దృష్ట్యా రాకపోకలు నిలిపివేసారు. కోనసీమ ముఖద్వారం రావులపాలెం ఆర్టీసీ బస్సు స్టాండ్ నీటమునిగిపోయింది. తుఫాన్ ప్రభావంతో ఉప్పాడ తీరంలో కోత గురయిన ప్రాంతాలను పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు సందర్శించారు. ఉప్పాడ,మాయపట్నం,సుబ్బంపేటలో బైక్ మీద తిరుగుతూ తుఫాన్ సహాయక చర్యలు పరిశీలించారు. నెల్లూరు జిల్లాలో మిచౌంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యటించారు. గొలగమూడి,అనికేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించి,బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. బాధితులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, బాధితులకు దుప్పట్లు, ఆహారం అందజేసారు. కనుపూరు చెరువు ఆయుకట్టను జిల్లా కలెక్టర్ హరి నారాయణ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఇదిలావుంటే కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం పీతలావ, వర్లగొంది తిప్ప గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నిడమర్రు, చిన్న గొల్లపాలెం, పడతడిక, ఇంతేరు సముద్ర తీరం వెంబడి 75 మంది అదనపు పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జాషువా తెలిపారు. కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో భారీ వర్షంతో చేతికి అంది వచ్చిన వరిచేలు నేలకు ఒరిగింది.ంది. దీంతో వాహన రాకపోకులకు అంతరాయం కలుగుతోంది.

అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు ముందున్న వాహనాలు సరిగా కనపడక ఇబ్బందులకు గురవుతున్నారు. తద్వారా వాహనాలు, ప్రయాణికులు ప్రమాదాలకు గురి అయ్యే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో వర్షాలు తగ్గి సాధారణ స్థితి వచ్చేంత వరకు రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 నుండి సాయంత్రం 8 వరకు మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకున్నారు.వరద బాధితులకు అండగా నిలుస్తూ అవసరమైన ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేపడుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరమొచ్చిన తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పూలవాని గుంట, గొల్లవాని గుంట ప్రాంతాల్లో వరద బాధితులను పరామర్శించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారితో పాటు అవసరమైన ప్రాంత ప్రజలకు పునరావాస కేంద్రాలకు రాలేని పరిస్థితి ఉన్నా సరే అలాంటి వారికి ఆహార పానియాలను అందజేయాలని తహశీల్దార్ వెంకట రమణను ఆదేశించారు. బాపట్ల జిల్లా చీరాలలో 10 నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేసారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో చీరాలలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. తీరప్రాంతంలోని 25 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విపత్తును ఎదుర్కొనేందుకు 16 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని అధికారులు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చీరాల తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో మరో మూడు రైళ్లు రద్దు చేశారు. గూడూరు-రేణిగుంట, రేణిగుంట-గూడూరు, తిరుపతి-పుల్ల రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. హౌరా కన్యాకుమారి రైలు దారి మళ్లించారు. రైళ్ల రాకపోకలపై తుపాను ఎఫెక్ట్ పడింది. హైదరాబాద్ నుంచి దక్షిణాదికి రైళ్లు నిలిచిపోగా, ఉత్తరాది నుంచి వచ్చే వాటికీ బ్రేక్ వేశారు.

ఇప్పటికే 150కిపైగా రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే తెలిపింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని రైల్వే అధికారులకు జీఎం ఆదేశాలు ఇచ్చారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో 4000 వేలమంది రైతుల వద్ద నుండి ఆన్‌లైన్‌లో 17,450, ఆఫ్ లైన్‌లో 1504 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. పెద్దాపురం మండలంలో 832 మంది రైతుల వద్ద నుండి ఆన్‌లైన్‌లో 4303, ఆఫ్‌లైన్‌లో 369 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రెండు మండలాల్లో 80 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. తుపాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు నెల్లూరు జిల్లా సోమశిల జలాశయానికి వరద కొనసాగుతున్నది. తుపాను ప్రభావంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. పశ్చిమ గోదావరి జిల్లాకు రెడ్ ఎలర్ట్, ఏలూరు జిల్లాకు ఆరెంజ్ ఎలర్ట్ ప్రకటన చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ముందస్తు

చర్యలు చేపట్టారు. నర్సాపురం, మొగల్తూరు రెండు మండలాల్లో 12 తుఫాన్ ప్రభావిత ప్రాంతాలు గుర్తించారు. భీమవరం కలెక్టర్ కార్యాలయంలో 'మిచాంగ్' తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవస సహాయం కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ 08816 299219...ఏర్పాటు అయ్యింది. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. జిల్లాలో 1. 40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. బాపట్ల, కోనసమీ, తూర్పుగోదావరి, కాకినాడ, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, పశ్చిమగోదావరి జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం చేసారు. పలు జిల్లాల్లో తుపాను ప్రభావంతో భారీ వర్షపాతం నమోదు అయ్యింది. కోనసీమలో86, క్రిష్ణా జిల్లాలో 55, బాపట్ల జిల్లాలో 64, నెల్లూరు జిల్లాలో 55, చిత్తూరు జిల్లాలో 93 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. గత రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలు. 10 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు అయ్యింది. తిరుపతి జిల్లా కోటలో అత్యధికంగా 388 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలో సున్నపువాగులో చిక్కుకున్న బందారు ప్లలెకు చెందిన శివ, వెంకటేష్ లను రక్షించారు.

# ఆర్టీసీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

- ఒకే గొడుకు కిందకు అన్ని సేవలు
- నల్సాఫ్ట్ సంస్థతో ఆర్టీసీ ఒప్పందం

**హైదరాబాద్,నేటిధాత్రి:**
ప్రయాణీకులకు మెరుగైన, సౌకర్యవంతమైన సేవలను అందించేందుకు గాను టీఎస్ఆర్‌టీసీ తాజాగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతమున్న అత్యాధునిక సాంకేతికను వినియోగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ ప్రాజెక్ట్ అమలుతో ఆధునికీకరణ వైపు దిశగా ముందడుగు వేసింది. డిజిటలైజేషన్ ఆవశ్యకతను గుర్తించి, ఈఆర్పీ ప్రాజెక్టులో భాగంగా సెంట్రలైజ్డ్ ఇంటిగ్రేటెడ్ సొల్యుషన్ సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అందుకు నల్సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సంస్థతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం హైదరాబాద్ బస్ భవన్‌లో సంస్థ ఉన్నతాధికారులతో కలిసి.. టీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనర్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. సందర్భంగా వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. టీఎస్ఆర్‌టీసీ సంస్థ సేవలను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈఆర్పీ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు వెల్లడించారు పది నెలల వ్యవధిలో ఈ ప్రాజెక్టుని అమల్లోకి తెచ్చాం. సమర్థవంతమైన ఆదాయ నిర్వహణ, వ్యయ నియంత్రణ కోసం సకాలంలో చర్యలకు సీఐఎస్ ప్రాజెక్ట్ దోహదపడుతోంది. అలాగే.. కేంద్రీకృత సమగ్ర డేటా లభ్యత, భద్రతతో పాటు మానవశక్తి వినియోగాన్ని అందిస్తుంది. అంతేకాదు.. ఆపరేషన్లపై కేంద్రీకృతం చేయడం, మార్గాలను క్రమబద్ధీకరించడం, ఇంధన నిర్వహణ, వ్యక్తిగత స్టోర్‌లు, వర్క్‌షాపులు, ఆదాయ నిర్వహణ, పే రోల్ వంటి కార్యకలాపాల నిర్వహణలో.. రాష్ట్రంలోని అన్ని డిపోలు, జోన్లతో పాటు ప్రధాన కార్యాలయం లోని వివిధ విభాగాలన్నింటినీ ఈఆర్పీ ఏకీకృతం చేస్తోంది. ఈ సేవల్ని వినియోగించుకోవడంలో దేశంలోని ఆర్టీసీల్లో టీఎస్ఆర్టీసీ మొదటిది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేశామని చెప్పుకొచ్చారు. నల్సాఫ్ట్ సీఈఓ నల్లూరి వెంకట్ మాట్లాడుతూ.. మెరుగైన సేవల్ని అందించేందుకు టీఎస్ఆర్టీసీతో భాగస్వామ్యం కావడం తమకు సంతోషంగా ఉందన్నారు. సమష్టి కృషి, అంకితభావంతో పని చేసి.. నిర్దేశించిన కాలానికే పూర్తి చేయగలిగామని చెప్పారు. ఆధునిక సాంకేతితను అందిపుచ్చుకోవడంలో టీఎస్ఆర్టీసీ ముందంజలో ఉందన్న ఆయన.. ఈ ప్రాజెక్టుని సకాలంలో పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావడంలో సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా.. 9 వేలకు పైగా బస్సులు, 50 వేల మంది ఉద్యోగులు కలిసిన టీఎస్ఆర్టీసీ ప్రతిరోజూ 35 లక్షల కిలోమీటర్ల నడుపుతూ సుమారు 45 లక్షల మంది ప్రయాణికులకు రవాణా సేవలు అందిస్తోంది. ఇంత విస్తృత నెట్వర్క్ కలిగి ఉన్న సంస్థ.. తాజా నిర్ణయంతో అన్ని సేవలను ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చింది.

# డీఎంకె ఎంపి సెంథిల్ విపరీత వ్యాఖ్యలు

## గోమూత్ర రాష్ట్రాలు అంటూ ఉత్తరాదిపై విమర్శలు

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
ద్రవిడ మున్నేట్ర కళగం ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ లోక్‌సభలో మంగళవారంనాడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు హిందీ భాషా రాష్ట్రాలను 'గోమూత్ర' రాష్ట్రాలుగా అభివర్ణించారు. ఆ రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుందని, దక్షిణాది రాష్ట్రాల్లోకాషాయ పార్టీకి గెలుపు ఉండదని

అన్నారు. తమిళనాడులోని ధర్మపురి లోక్‌సభ నియోజకవర్గానికి సెంథిల్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోక్‌సభలో జమ్మూ కశ్మీర్ బిల్లులపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందీ భాష మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలుగా అభివర్ణించారు. ఈ రాష్ట్రాల్లోనే బీజేపీ విజయం సాధిస్తుంటుందన్నారు. హిందీ భాషా రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

అయితే సెంథిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి మీనాక్షి లేఖ ఖండించారు. ఎంపీ వ్యాఖ్యలు సమానత ధర్మాన్ని అవమానించడమేనని చెప్పారు. త్వరలోనే డీఎంకేకు గోమూత్రం వల్ల లాభాలు ఏంటో తెలుస్తాయన్నారు. దేశ ప్రజలు ఇలాంటి ద్వేషుల్ని సహించరని, తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కాగా, గోమూత్ర రాష్ట్రాలంటూ డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ అధీర్ కుమార్ రంజన్‌ను మీడియా ప్రశ్నించినప్పుడు, అది వారి వ్యక్తిగత అభిప్రాయమన్నారు. పార్లమెంటులో ఎవరైనా వ్యక్తిగత అభిప్రాయాలు చెప్పినప్పుడు దాంతో తమకు సంబంధం ఉండదన్నారు. తాము గోమాతను గౌరవిస్తామని చెప్పారు.



- సిఎల్పి నేతగా రేవంత్ పేరు ఖరారు చేసిన కాంగ్రెస్
- 7న సిఎంగా రేవంత్ ప్రమాణస్వీకారం
- మీడియా సమావేశంలో ప్రకటించిన కెసి వేణుగోపాల్
- ఉదయం నుంచి సిఎం పదవిపై వరుస భేటీలు..చర్చలు

# తెలంగాణ సీఎంగా రేవంత్



ఢిల్లీ వేదికగా మంగళవారం ఉదయం నుంచి వరుస భేటీలు సాగుతున్నాయి. మల్లికార్జున ఖర్గేతో రాహుల్ భేటీ అయ్యారు. తరవాత డికె శివకుమార్ కూడా భేటీ అయ్యారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు కొందరు ఢిల్లీకి చేరుకున్నారు. ఈ క్రమంలో సిఎం ఎవరన్నది ప్రకటించాల్సి ఉంది. అయితే అనూహ్యంగా హైదరాబాద్‌లో ఉన్న రేవంత్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. సిఎం పదవికి రేవంత్ పేరునే నేతలంతా ఖరారు చేశారని, మంత్రివర్గ కూర్పుపై తుదినిర్ణయం తీసుకునేందుకే రేవంత్‌ను ఢిల్లీకి రావాలని ఆదేశించారని సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కాంగ్రెస్ ముఖ్యనేతలతో కీలక సమావేశం జరిగిం ఈ భేటీలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క పాల్గొన్నారు. తెలంగాణకు కాబోయే సీఎం అభ్యర్థిపై చర్చించిట్లు తెలుస్తోంది. సీఎం అభ్యర్థి ఎంపికపై కాసేపట్లో ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా తమకు ఆమోద

యోగ్యమేనని భట్టి విక్రమార్క, ఉత్తమ్‌లు తెలిపారు. తన అభిప్రాయం కూడా కాంగ్రెస్ హైకమాండ్‌కు చెప్పానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీఎం అయ్యేందుకు నాకు అన్ని అర్హతలు ఉన్నాయని, మొదటి నుంచి తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం అభ్యర్థి ఎంపికపై హైకమాండ్ అన్ని ఆలోచనలు చేస్తుందని, నలుగురు.. ఐదుగురు రేసులో ఉండటం తప్పుకాదని ఉత్తమ్ అన్నారు. హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, పార్టీ అంతర్గత విషయాలు బయటకు చెప్పలేనని ఉత్తమ్ తెలిపారు. తాజాగా ప్రమాణస్వీకారానికి రాజ్‌భవన్‌లో సైతం ముమ్మర ఏర్పాట్లు జరిగాయి. ఈ క్రమంలో పార్టీ పరిశీలకుల సమావేశంలో సోమవారం సీఎల్పీ మీటింగ్ జరిగింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలంతా సీఎం ఎంపిక బాధ్యతను అధిష్ఠానానికి అప్పగించారు. సీఎం పదవి, కేబినెట్ బెర్తుల విషయంలో పంచాయితీ నేపథ్యంలో వాయిదాపడింది. ముఖ్య నేతలు పట్టువీడకపోవడంతో డీకే శివకుమార్‌తో పాటు పరిశీలకులను అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు సీనియర్లు సైతం ఢిల్లీలో మకాం వేశారు. ఎవరికి వారు తమ బెర్తుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి పదవి కోసం కూడా పలువురు నేతలు ఢిల్లీలో అప్పుడే లాబీయింగ్ మొదలు పెట్టారు. తాజాగా మరో నేత సైతం ఢిల్లీలో ప్రత్యక్షమ య్యారు. బెల్లంపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన జీ వినోద్ ఢిల్లీలో మకాం వేసారు. మంగళవారం కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీతో భేటీ అయ్యారు. అయితే, వినోద్ సోదరుడు సైతం వివేక్ చెన్నూరు నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. ప్రస్తుతం అన్నాదమ్ముళ్లు ఇద్దరు మంత్రి పదవి కోసం పోటీపడుతున్నారు. అయితే, ఇద్దరిలో ఒకరికి మాత్రమే పదవి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉండడంతో ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న వినోద్ ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పార్టీ అధినేత్రి సోనియాగాంధీని కలిశారు. తాను గతంలో మంత్రిగా పని చేశానని.. తనకు మరోసారి కేబినెట్‌లో అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది. మరో వైపు వివేక్ మాత్రం హైదరాబాద్‌లోనే ఉండి మంతనాలు చేస్తున్నారు. సీఎం రేసులో ఉన్న టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డితో మంతనాలు జరుపుతున్నారు. మంత్రి పదవి ఇస్తేనే కాంగ్రెస్‌లో చేరేందుకు వివేక్ సమ్మతించారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అన్నాదమ్ముళ్లు ఇద్దరు కేబినెట్ బెర్తు కోసం లాబీయింగ్ చేస్తున్నారు. సోనియా సమావేశం అనంతరం మీడియాతో వినోద్ మాట్లాడుతూ.. తాను 2004-2009 వరకు మంత్రిగా పని చేశానన్నారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన అవకాశంతో మరోసారి కేబినెట్‌లో చోటు చేసుకోసం రెక్వెస్ట్ కోసం ఢిల్లీకి వచ్చానని.. ఈ మేరకు సోనియాకు విజ్ఞాపనపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. మంత్రి పదవి ఖాయమనే సంకేతాలున్నాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎంపికపై సీనియర్లు చర్చలు జరుపుతున్నారన్నారు. ఇవాళ లేదంటే రేపు సీఎంను ప్రకటించే అవకాశం ఉందన్నారు. 7వ తేదీన.. లేదంటే 9న కొత్త సీఎం ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంటుందన్నారు. సీఎం అభ్యర్థిత్వంపై మల్లికార్జున ఖర్గే, డీకే శివకుమార్ చర్చలు జరుపుతున్నారన్నారు. ఎమ్మెల్యేల అందరికీ అభిప్రాయాలను తీసుకొని హైకమాండ్‌కు పంపారన్నారు. హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. తాను వెంకటస్వామి కొడుకునని.. హైకమాండే లా అన్నారు. ఏ ఆదేశాలు ఇచ్చినా స్వీకరిస్తామని.. నాకున్న అనుభవంతో మంత్రిత్వ శాఖ ఇచ్చినా మేనేజ్ చేయగలుగుతానన్నారు. ఐదేళ్లపాటు ఎలాంటి రిమార్క్ లేకుండా వైఎస్ కేబినెట్‌లో పని చేశానని.. తనకు మంచి అవగాహన ఉందన్నారు. తన సేవలను ఏలాగైనా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణ తదుపరి సీఎం ఎవరనేదానిపై తీవ్రమైన

ఉత్కంఠ కొనసాగుతున్న వేళ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో సీపీఐ నేతలు నారాయణ, చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేపథ్యంలో ఒకరినొకరు అభినందించుకోవడానికి హోటల్ ఎల్లాకు వచ్చారు. కాగా మల్లికార్జున ఖర్గేతో భేటీ అనంతరం తిరుగు పయనమైన పరిశీలకుడు, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ హైదరాబాద్ చేరుకోనున్నట్లు సమాచారం. నగరం చేరుకున్నాక సీనియర్లతో చర్చ అనంతరం సీఎం పేరుని అధికారికంగా ప్రకటించనున్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి పేరుని నిర్ణయించి ప్రకటన చేయనున్నారని తెలుస్తోంది. రేవంత్ పేరును ఖరారు చేస్తూ ఏఐసీసీ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ఈ విషయాన్ని డీకే శివకుమార్ ఎమ్మెల్యేలతో చెప్పిన తర్వాత ప్రకటన చేయనున్నారని సమాచారం.

కాగా సోమవారం హైదరాబాద్‌లో సీఎల్పీ భేటీ తర్వాత పరిశీలకుల బృందం ఢిల్లీ వెళ్లి అధిష్ఠానంతో చర్చించింది. ఆ వెంటనే భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఢిల్లీ వెళ్లి అధిష్ఠానం పెద్దలతో చర్చలు జరిపాయి. అయితే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాత్రం హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఈ క్రమంలో ఢిల్లీకి రావాలని పిలుపు రావడంతో హుటాహుటిన రేవంత్ బయలుదేరి వెళ్లారు.

# తెలుగోడికి నో ఛాన్స్..

## సౌతాఫ్రికాతో తొలి టీ20 ఆడే భారత తుది జట్టు



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా.. మరో ఆసక్తికర పర్యటనకు సిద్ధమైంది. మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం సుమారు రెండు నెలలపాటు సౌతాఫ్రికాలో పర్యటించనుంది. ఇప్పటికే ఈ టూర్‌కు సంబంధించిన మూడు ఫార్మాట్ల జట్లను అజిత్ అగార్కర్ సారథ్యంలోని భారత సెలెక్షన్ కమిటీ ప్రకటించింది.టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు ప్రధాన పేసర్లు మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రాలు ఈ పర్యటనలోని వైట్‌బాల్ సిరీస్‌లకు దూరమయ్యారు.

పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడలేమని బీసీసీఐకి తెలియజేయడంతో సెలెక్టర్లు వారికి విశ్రాంతినిచ్చారు. రెండు టెస్ట్‌ల సిరీస్‌తో ఈ నలుగురు సీనియర్ ఆటగాళ్లు రీఎంట్రీ ఇవ్వనున్నారు. వన్డే ప్రపంచకప్‌లో చీలమండ గాయానికి గురైన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ పర్యటన మొత్తానికి దూరమయ్యాడు.

దాంతో టీ20 సారథిగా సూర్యకుమార్ యాదవ్.. వన్డే కెప్టెన్‌గా కేఎల్ రాహుల్‌లను భారత సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. ఈ పర్యటనలో ముందుగా మూడు టీ20ల సిరీస్ జరగనుంది. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ముగిసిన అనంతరం ఇళ్లకు వెళ్లిపోయిన భారత ఆటగాళ్లు.. బుధవారం లేదా గురువారం(డిసెంబర్ 7) సౌతాఫ్రికా ఫ్లైట్ ఎక్కనున్నారు. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా ఆదివారం డర్బన్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య సౌతాఫ్రికాతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలోనే ఈ సిరీస్ జరగనుంది. అయితే తొలి మ్యాచ్ ఆడే తుది జట్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

స్టార్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్.. రీఎంట్రీ ఇచ్చిన నేపథ్యంలో తుది జట్టు ఎంపిక సవాల్‌గా మారింది. కుర్రాళ్లనే కొనసాగిస్తారా? లేక స్టార్ ఆటగాళ్లకు అవకాశం ఇస్తారా? అనేది చూడాలి. సౌతాఫ్రికాపై రాణించాలంటే అనుభవం కూడా చాలా ముఖ్యం.

కాబట్టి సీనియర్ ఆటగాళ్లకు తొలి ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ కావాలనుకుంటేనే ఇషాన్ కిషన్‌ను ఓపెనర్‌గా ఆడించనున్నారు. లేదంటే అతను మిడిలార్డర్‌లో ఆడనున్నాడు.

ఐదుగురు బౌలర్లతోనే బరిలోకి దిగితే మాత్రం యశస్వీ జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్‌ల్లో ఒకరు శుభ్‌మన్ గిల్‌కు జతగా ఆడనున్నారు. మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్‌తో పాటు శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్, రవీంద్ర జడేజా బరిలోకి దిగనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశం ఉంది.

పేస్ పిచ్‌లను పరిగణలోకి తీసుకోని ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే మాత్రం కుల్దీప్ యాదవ్ బెంచ్‌కే పరిమితమవుతాడు. మహమ్మద్ సిరాజ్ పేస్ విభాగాన్ని లీడ్ చేయనున్నాడు. దీపక్ చాహర్, ముఖేష్ కుమార్‌లతో కలిసి అతను పేస్ బాధ్యతలను పంచుకోనున్నాడు.

ఎక్స్‌ట్రాపేసర్ కావాలనుకుంటే అర్ష్‌దీప్ సింగ్ బరిలోకి దిగుతాడు. స్వింగ్ చేయగల సామర్థ్యంతో పాటు లోయరార్డర్‌లో బ్యాటింగ్ చేయగల సత్తా ఉన్న దీపక్ చాహర్‌కు అర్ష్‌దీప్ సింగ్ కంటే ఎక్కువ ప్రాధాన్యత లభించనుంది. జట్టులో నెలకొన్న తీవ్ర పోటీ నేపథ్యంలో తెలుగు తేజం తిలక్ వర్మతో పాటు జితేష్ శర్మ, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్‌లు బెంచ్‌కే పరిమితం కానున్నారు.

**భారత తుది జట్టు(అంచనా):**
శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్/ రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్, రవీంద్ర జడేజా, దీపక్ చాహర్, ముఖేష్ కుమార్, మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్/అర్ష్‌దీప్ సింగ్.

**భారత టీ20 జట్టు:**
యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), రింకూ సింగ్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్(కీపర్), జితేశ్ శర్మ(కీపర్), రవీంద్ర జడేజా(వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్, దీపక్ చాహర్.

## ఐపీఎల్ లో రూ.10 కోట్లకు పైగా
# ధర పలికే స్టార్ ప్లేయర్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్-17 కోసం ఈ నెల 19వ తేదీన అక్షన్ జరగనుంది. అయితే, ఈ వేలంలో కొత్త రికార్డులు బద్దలయ్యే ఛాన్స్ కనిపిస్తుంది. అన్ని ఫ్రాంచైజీలు ఇప్పటికే తమ ఆటగాళ్లను విడుదల, రిటైన్ చేసుకున్న వారి జాబితాను పంపించాయి. రాబోయే 2024 సీజన్ లో ఇరు జట్లకు రూ.100 కోట్ల పారితోషికం అందనుంది. ఇక, రాబోయే వేలంలో రూ.10 కోట్లకు పైగా దక్కించుకునే ఐదుగురు విదేశీ స్టార్ ఆటగాళ్లు వీరే.. అయితే, ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్ లో ఆస్ట్రేలియా కప్ సాధించడంలో ట్రావిస్ హెడ్ కీలక పాత్ర పోషించాడు. అతడి ధనాధన్ ఇన్నింగ్స్ తో హెడ్ ను దక్కించుకునేందుకు పలు జట్లు పోటీ పడే అవకాశం ఉంది. ఈ సీజన్ ఐపీఎల్ వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, కోల్ కతా నైట్ రైడర్స్ జట్లు ట్రావిస్ హెడ్ ను దక్కించుకోవాలని చూస్తున్నాయి. ఇక, ప్రపంచకప్ లో న్యూజిలాండ్ తరపున అత్యుత్తమ ప్రదర్శన చేసిన రచిన్ రవీంద్రను సైతం దక్కించుకునేందుకు ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టి పెట్టాయి. రచిన్ బాగా బౌలింగ్ కూడా చేస్తుండటంతో అతడి కోసం ఫ్రాంఛైజీలు పోటీ పడే ఛాన్స్ ఉంది. ఇక, మిచెల్ స్టార్క్ చాలా కాలం తర్వాత మళ్లీ ఐపీఎల్ లో వేలానికి వస్తున్నాడు. స్టార్క్ చివరి సారిగా 2015లో ఆర్సీబీ తరఫున ఆడాడు. అదే ఫ్రాంచైజీ నుంచి స్టార్క్ కు ఎక్కువ బిడ్లు వచ్చే ఛాన్స్ ఉంది. బెంగళూరు ఫ్రాంచైజీ ఈ అనుభవజ్ఞుడైన బౌలర్ కోసం పోటీ పడే ఛాన్స్ కూడా ఉంది. మరో వైపు జోఫ్రా ఆర్చర్ ను ముంబై ఇండియన్స్ వదులుకోవడంతో స్టార్క్ ను దక్కించుకోవడానిక ట్రై చేస్తుంది. అలాగే, వరల్డ్ కప్ లో సౌతాఫ్రికా తరపున అద్భుతంగా రాణించి 20 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించిన ఈ స్టార్ బౌలర్ డిసెంబర్ 19న దుబాయ్ లో జరిగే వేలంలో మోస్ట్ వాంటెడ్ పేసర్ గా బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. అలాగే, న్యూజిలాండ్ కు చెందిన మరో స్టార్ ప్లేయర్ డారిల్ మిచెల్ సాలిడ్ ను సైతం దక్కించుకోవడానికి పలు ఫ్రాంఛైజీలు పోటీ పడుతున్నాయి. అతని బ్యాటింగ్ పవర్ తో ధనాధన్ ఇన్నింగ్స్ తో రెచ్చిపోతాడు. దీంతో పాటు మిచెల్ బౌలింగ్ కూడా చేస్తాడు.. ఫీల్డింగ్ కూడా అద్భుతంగా చేస్తుండటంతో అతడ్ని దక్కించుకునేందుకు పోటీ గట్టిగానే ఉంటుంది.

# విరాట్ కోహ్లీని కెప్టెన్సీ నుంచి నేను తప్పించలేదు!



టీమిండియా కెప్టెన్సీ బాధ్యతల నుంచి విరాట్ కోహ్లీని తాను తొలగించలేదని బీసీసీఐ మాజీ ప్రెసిడెంట్ సౌరవ్ గంగూలీ మరోసారి స్పష్టం చేశాడు. కోహ్లీనే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నాడని వెల్లడించాడు. టీ20 కెప్టెన్సీ వదులుకుంటాననంటే.. వన్డే కెప్టెన్సీ కూడా వదిలేయాలని మాత్రమే తాను సూచించానని చెప్పాడు. ఇది కూడా కోహ్లీ మంచిని కోరే చెప్పానని తెలిపాడు. టీ20 ప్రపంచకప్ 2021 ఘోర పరాజయం అనంతరం విరాట్ కోహ్లీ టీ20 సారథ్యానికి గుడ్‌బై చెప్పాడు. వన్డే ఫార్మాట్‌తో పాటు టెస్ట్ క్రికెట్‌లో సారథిగా కొనసాగాలనుకున్నాడు. కానీ టీ20 సారథ్యం వదులుకున్న కోహ్లీని.. వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తప్పించారు. వన్డే ప్రపంచకప్ 2023 నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే అప్పట్లో ఈ నిర్ణయంపై తీవ్ర దుమారం రేగింది. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించారని విరాట్ కోహ్లీ మీడియా ముందు అసంతృప్తి వ్యక్తం చేశాడు. విరాట్ కోహ్లీకి చెప్పే ఈ నిర్ణయం తీసుకున్నామని గంగూలీ వివరణ ఇవ్వగా.. అతని వ్యాఖ్యలను కూడా కోహ్లీ ఖండించాడు. కెప్టెన్సీ గురించి తనతో ఎవరూ మాట్లాడలేదని, నిర్ణయాన్ని ప్రకటించే ముందు ఫోన్‌లో సమాచారమిచ్చారని తెలిపాడు. వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడాన్ని అవమానంగా భావించిన కోహ్లీ.. టెస్ట్ కెప్టెన్సీని కూడా వదిలేసాడు. అప్పటి నుంచి కోహ్లీ-గంగూలీ మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఐపీఎల్ 2023 సీజన్ సందర్భంగా కూడా ఈ ఇద్దరూ కనీసం ఒకరినొకరు పలకరించుకోలేదు. ఒకరి వైపు మరొకరు ఆగ్రహంగా చూసుకున్నారు. కోహ్లీని కెప్టెన్సీ నుంచి తప్పించిన విధానాన్ని తప్పుబట్టిన బీసీసీఐ ఆఫీస్ బేరర్లు.. అతను మరోసారి బీసీసీఐ అధ్యక్షుడిగా కొనసాగకుండా అడ్డుకున్నారు.



ఐసీసీ ప్రెసిడెంట్ అయ్యే అవకాశాలున్నా.. మద్దతు ఇవ్వలేదు. దాంతో గంగూలీ.. బీసీసీఐని వీడాల్సి వచ్చింది. ప్రస్తుతం అతను ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు. తాజాగా దాదాగిరి అన్‌లిమిటేడ్ సీజన్ 10 అనే రియాల్టీ షోలో పాల్గొన్న గంగూలీని విరాట్ కోహ్లీ కెప్టెన్సీ ఎపిసోడ్‌పై ప్రశ్నించగా.. తన తప్పేం లేదని వివరణ ఇచ్చాడు. 'విరాట్ కోహ్లీని కెప్టెన్సీ బాధ్యతల నుంచి నేను తప్పించలేదు. ఇప్పటికే ఈ విషయాన్ని చాలా సార్లు చెప్పాను. టీ20ల్లో కెప్టెన్‌గా కొనసాగేందుకు అతను అనాసక్తిని ప్రదర్శించాడు. టీ20 సారథ్య బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. టీ20ల్లో కెప్టెన్‌గా కొనసాగలేనప్పుడు.. వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తప్పుకోవాలని నేను సూచించాను. కేవలం టెస్ట్‌ల్లో మాత్రమే సారథ్యం చేయమని చెప్పాను. అతని మంచి కోరే ఈ సలహా ఇచ్చాను.'అని సౌరవ్ గంగూలీ చెప్పుకొచ్చాడు.


## ఐపీఎల్ ఆడొద్దంటూ స్టార్ ప్లేయర్‌కు
# నోటీసులిచ్చిన ఇంగ్లండ్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 17 వేలం కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 19న దుబాయ్‌లో జరగనున్న వేలం ప్రక్రియ కోసం 1166 మంది ఆటగాళ్లు ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారు. అయితే, ఈ జాబితాలో ఇంగ్లండ్ ప్రముఖ పేసర్ జోఫ్రా ఆర్చర్ పేరు కనిపించలేదు. జోఫ్రా గత సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఆడాడు. ఐపీఎల్ 2022 వేలంలో, ఆర్చర్ ఆర్చర్‌ను ముంబై ఫ్రాంచైజీ రూ. 8 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, గాయం కారణంగా అతను ఐపీఎల్ సీజన్ 15 ఆడలేదు. ఫిట్‌నెస్ సమస్య కారణంగా, అతను సీజన్ 16లో కేవలం 5 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. ఈ కారణంగా, జోఫ్రా ఆర్చర్‌ను ఈ వేలానికి ముందు ముంబై ఇండియన్స్ విడుదల చేసింది. అయితే వేలంలో కనిపిస్తాడని చెప్పుకొచ్చారు. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు సూచనల మేరకు జోఫ్రా ఆర్చర్ ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. జోఫ్రా ఆర్చర్ గత ఏడాది కాలంగా ఇంగ్లండ్ తరపున ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ఆర్చర్, ఇప్పుడు తన పనిభారాన్ని నిర్వహించడానికి %ఖూూ% నుంచి వైదొలగాలని %జుజదీ% కోరింది. అంటే, ఐపీఎల్ ముగిసిన తర్వాత ఇక్కడ టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆర్చర్ ఫిట్‌నెస్‌ను పర్యవేక్షించాలని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నిర్ణయించింది. అందుకే ఈసారి ఐపీఎల్ ఆడవద్దని జోఫ్రాకు సూచించింది. జోఫ్రా ఆర్చర్‌ను ముంబై ఇండియన్స్ 8 కోట్ల రూపాయలకు %ఖూూ% 2022లో చేర్చుకుంది. ఇంగ్లండ్ క్రికెట్ తీసుకున్న ఈ నిర్ణయం తర్వాత జోఫ్రా ఆర్చర్ ఐపీఎల్ ఆడాలనుకున్నా ఆడలేదు. నిబంధనల ప్రకారం, ఓవర్సీస్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో ఆడేందుకు ప్రతి క్రీడాకారుడికి బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (%చీూజ%) అవసరం. కాబట్టి ఆర్చర్ ఐపీఎల్ ఆడలేడు. కాగా, టీ20 క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు జోఫ్రా ఆర్చర్ ముఖ్యమైన ఆటగాడిగా మారబోతున్నాడు. గాయం కారణంగా ఆర్చర్ ఈ ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడలేకపోయాడు. దీంతో ఇంగ్లండ్ భారీ నష్టాన్ని చవిచూసింది. ఈ విధంగా త్వరలో జరగనున్న టీ-20 ప్రపంచకప్ నేపథ్యంలో ఇంగ్లండ్ 'నో ఐపీఎల్' అనే ప్రచారాన్ని అమల్లోకి తెచ్చింది. హ్యారీ బ్రూక్‌తో పాటు ఆదిల్ రషీద్, క్రిస్ వోక్స్ సహా 34 మంది ఆటగాళ్లు ఐపీఎల్ వేలానికి రిజిస్టర్ చేసుకున్నారు.

# ఆ ముగ్గురే సన్‌రైజర్స్ టార్గెట్..

క్రికెట్ ఫ్యాన్స్ అందరూ కూడా ఐపీఎల్ 2024 వేలంపైనే దృష్టి పెట్టారు. డిసెంబర్ 19న దుబాయ్ వేదికగా ఈ మినీ వేలం జరగనుండగా.. ఇందుకోసం బీసీసీఐ ఏర్పాట్లు వేగంగా చేస్తోంది. ఇక 1166 మంది ప్లేయర్లు తమ పేర్లను వేలంలో రిజిస్టర్ చేసుకున్నారు. అలాగే ఇందులో నుంచి 77 మంది ప్లేయర్స్‌ను ఫ్రాంచైజీలు కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. సన్‌రైజర్స్ జట్టు ఈసారి వేలంలో ముగ్గురు కీ ప్లేయర్స్‌ను కొనుగోలు చేయడమే టార్గెట్‌గా పెట్టుకుంది. ఒకవేళ అదే జరిగితే సన్‌రైజర్స్ హైదరాబాద్ పవర్‌ఫుల్ జట్టు కావడం పక్కా. 2023 ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన కనబరిచిన సన్‌రైజర్స్.. ఆ ఏడాది అత్యధిక డబ్బులతో కొనుగోలు చేసిన పలువురు ప్లేయర్స్‌ను విడిచిపెట్టింది. ఈ క్రమంలోనే జట్టులో 6 స్థానాలు మిగిలున్నాయి. ఇందులో విదేశీ ప్లేయర్స్ కోసం 3 స్థానాలు ఉండగా.. ఆ స్లాట్స్ కోసం ముగ్గురిపై టార్గెట్ పెట్టుకుంది కావ్య పాప, సన్‌రైజర్స్ యాజమాన్యం. కోట్లైనా సరే.. తగ్గేదేలే అంటూ కాసుల వర్షం కురిపించేందుకు హైదరాబాద్ సిద్ధమైంది. వన్డే ప్రపంచకప్‌లో 3 శతకాలతో రెచ్చిపోయిన రచిన్ రవీంద్ర.. అటు బ్యాట్స్‌మెన్‌గా.. ఇటు బౌలర్‌గా రెండు బాధ్యతలు చేయగలడు. ఆల్‌రౌండర్ పాత్రకు సరిగ్గా సరిపోతాడు. దీంతో సన్‌రైజర్స్ రచిన్‌పై కన్నేసింది. ట్రావిస్ హెడ్ విధ్వంసకర ఓపెనర్ మాత్రమే కాదు.. మ్యాచ్‌ను ఈజీగా మలుపు తిప్పగలడు. వరల్డ్‌కప్ ఫైనల్‌లో భారత్‌పై అద్భుత సెంచరీ చేసిన విషయం తెలిసిందే. శ్రీలంకన్ మిస్టరీ స్పిన్నర్ వానిందు హసరంగా కోసం కూడా సన్‌రైజర్స్ పోటీ పడుతోంది. జట్టుకు లెగ్ స్పిన్నర్ సమస్య ఉండటంతో.. కచ్చితంగా వేలంలో కాసులు కురిపించడం ఖాయం.






## ఆ రోజే టైటిల్ ప్రకటన

'కేజీఎఫ్' సిరీస్ చిత్రాలతో దేశవ్యాప్తంగా తిరుగులేని స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నారు కన్నడ హీరో యష్. 'కేజీఎఫ్-2' తర్వాత ఆయన తదుపరి సినిమా కోసం దేశవ్యాప్తంగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ చేయబోయే సినిమా ఎలా ఉంటుందోనని అందరిలో ఆసక్తి పెరిగింది.
'యష్-19' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా అప్‌డేట్‌ను అందించారు యష్. డిసెంబర్ 8న ఈ సినిమా టైటిల్ ప్రకటన ఉంటుందని తెలిపారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన దర్శకుడి వివరాలను యష్ వెల్లడించనప్పటికీ.. జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వ బాధ్యతలను తీసుకోనున్నారని తెలిసింది. ప్రస్తుతం ఈ సినిమా లొకేషన్ సెర్చ్ కోసం యష్ శ్రీలంకలో పర్యటిస్తున్నట్లు సమాచారం.



# దగ్గుబాటి వారసుడి సినిమాకు మోక్షం..




### ఆరు నెలల తర్వాత ఎట్టకేలకు ఓటీటీలోకి!


ఈ రోజుల్లో ఒక సినిమా విడుదలైన నెలరోజుల్లోనే ఓటీటీలోకి వచ్చేస్తోంది. మరీ బ్లాక్‌బస్టర్ హిట్ కొడితే 45 రోజుల దాకా టైమ్ తీసుకుంటుంది. లేదంటే నాలుగు వారాల్లోనే ఓటీటీలోకి వస్తుంది. కానీ ఒక సినిమా మాత్రం థియేటర్‌లో రిలీజైన ఆరు నెలల తర్వాత ఇప్పుడు ఓటీటీలోకి వచ్చింది. అదే దగ్గుబాటి వారసుడు అభిరామ్ హీరోగా అరంగేట్రం చేసిన అహింస. ఎట్టకేలకు ఈ సినిమాకు మోక్షం రావడంతో అమెజాన్ ప్రైమ్ వీడియోస్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు తనయుడు రానా దగ్గుబాటి నటుడిగా టాలీవుడ్‌తో పాటు ఇతర సినీ ఇండస్ట్రీల్లోనూ మంచిపేరు తెచ్చుకున్నాడు. దీంతో సురేశ్ బాబు రెండో తనయుడు అభిరామ్ కూడా సినిమాలవైపే అడుగువేశాడు. తేజ దర్శకత్వంలో అహింస అనే సినిమా చేశాడు. కానీ ఈ సినిమాకు ఆరంభం నుంచే కష్టాలు వెంటాడాయి. దీంతో సినిమా దాదాపు రెండేండ్లు సెట్స్‌పైనే ఉంది. చివరకు షూటింగ్ కంప్లీట్ చేసుకుని ఈ ఏడాది జూన్ 2వ తేదీన థియేటర్లలోకి వచ్చింది. కానీ ఈ సినిమా దగ్గుబాటి ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. డిజాస్టర్ టాక్ రావడంతో విడుదలైన వారం రోజుల్లోనే సినిమా థియేటర్ల నుంచి వెళ్లిపోయింది. అహింస సినిమా డిజిటల్ రైట్స్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియోస్ దక్కించుకుంది. కానీ ఈ సినిమాను స్ట్రీమింగ్ చేసేందుకు మాత్రం పెద్దగా ఆసక్తి చూపించలేదు. చాలాసార్లు ఓటీటీ రిలీజ్ డేట్‌ను వాయిదా వేస్తూ వచ్చింది. సెప్టెంబర్‌లోనే ఈ సినిమా టీవీల్లోనూ టెలికాస్ట్ అయ్యింది. అయినప్పటికీ ఈ సినిమాను అమెజాన్ ప్రైమ్ వీడియోస్ పట్టించుకోలేదు. కానీ ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు అహింస సినిమా స్ట్రీమింగ్‌కు వచ్చింది.

# కమల్ నాయిక ఆమేనా?

కమల్‌హాసన్, మణిరత్నం.. అనగానే 'నాయకుడు' సినిమా గుర్తొస్తుంది. ఆ సినిమా వచ్చి 36ఏళ్లు నిండాయి. అంత సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కమల్‌హాసన్, మణిరత్నం కలిసి పనిచేస్తున్న సినిమా 'థగ్ లైఫ్'. ప్రకటన వచ్చిన నాటినుంచి ఈ సినిమాపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. విభిన్న కథలతో సినిమాలు చేసే మణిరత్నం.. కమల్‌తో చేయబోతున్న సినిమాకు ఏ తరహా కథను ఎంచుకొని ఉంటాడన్నది ఇప్పుడు సినీవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంచనాలకు అందని రీతిలో ఈ సినిమా కథ, కథనాలు ఉంటాయనేది చెన్నయ్ సమాచారం. ఇదిలావుంటే, ఇందులో కథానాయికగా త్రిష, నయనతార పేర్లు అప్పట్లో ప్రముఖంగా వినిపించాయి. ఆ తర్వాత





ఐశ్వర్యరాయ్ దాదాపు ఖరారైనట్టు వార్తలు కూడా వచ్చాయి. అయితే, ఇప్పుడు వీరెవర్నీ కాకుండా మలయాళం కథానాయిక మంజు వారియర్‌ని హీరోయిన్‌గా ఫైనల్ చేశారనేది టాక్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నవి. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.



### గాలా 2023 ఈవెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా

## దీపికా పదుకొనే.. ట్రెండింగ్‌లో స్టిల్స్

ఈ ఏడాది జవాన్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది బాలీవుడ్ భామ దీపికాపదుకొనే . జవాన్‌లో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించి.. మంచి మార్కులు కొట్టేసింది. తాజాగా లాస్ ఏంజెల్స్‌లో అకాడమీ మ్యూజియం గాలా ఈవెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది దీపికాపదుకొనే. థిక్ బ్లూ వెల్వెట్ కలర్ డ్రెస్‌లో హొయలు పోతూ కెమెరాకు స్టన్నింగ్ పోజులిచ్చింది.
సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వంలో హృతిక్ రోషన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం స్పిరిట్ ఆఫ్ ఫైటర్‌లో దీపికా పదుకొనే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. యాకామ్ 18 స్టూడియోస్-మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్త నిర్మాణంలో వస్తున్న ఈ మూవీ 2024 జనవరి 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మరోవైపు ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న %ఖుశ్రీఎఱ 2898 -ాణ%లో ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. దీపికా పదుకొనే %ూఱఅస్త్రష్ణుఎ -ాస్త్రుఱఅ%లో కూడా నటిస్తుండగా.. చిత్రీకరణ దశలో ఉంది.



# మానవసంబంధాలు భావోద్వేగాల సమ్మేళనం

"సీతారామం'తో ప్రేక్షకులు నన్ను చూసే విధానం మారింది. నేను ఎంచుకునే పాత్రల విషయంలో కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అందుకే.. మనసుకు దగ్గరైన మంచి పాత్రలు చేయాలని నిశ్చయించుకున్నాను. 'హాయ్ నాన్న'లో నేను చేసిన 'యష్ణ' పాత్ర అలాంటిదే. ఇదో అద్భుతమైన కథ. విరాజ్, యష్ణ ప్రయాణాన్ని చూసిన ప్రేక్షకులు కచ్చితంగా వారితో ప్రేమలో పడిపోతారు.' అని మృణాళ్ ఠాకూర్ అంటున్నది. నాని జోడీగా ఆమె నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడు.
మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల నిర్మాతలు. ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మృణాళ్ ఠాకూర్ విలేకరులతో ముచ్చటించింది. ' 'సీతారామం'లో సీత.. 'హాయ్ నాన్న'లో యష్ణ. రెండూ వైవిధ్యమైన పాత్రలే. 'సీతారామం' 60, 70ల్లో జరిగే కథ. 'హాయ్ నాన్న' నేటి తరానికి చెందిన కథ. ఇందులో నా పాత్ర కూడా ఇప్పటి అమ్మాయిలకు ప్రతిరూపంలా ఉంటుంది.
ఈ పాత్రలో చాలా లేయర్లుంటాయి. మానవసంబంధాలు, భావోద్వేగాల సమ్మేళనం ఈ సినిమా. ఒక్కమాటలో చెప్పాలంటే 'డివైన్'. షూటింగ్ చేస్తున్నప్పుడు అదే భావనతో పనిచేశాం' అని చెప్పింది మృణాల్. నానీతో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభూతి అని, ఆయనతో నటిస్తుంటే పర్‌ఫార్మెన్స్ మరింత ఎలివేట్ అవుతుందని మృణాళ్ అన్నారు.
అందరం నిజాయితీగా పనిచేశాం. చేస్తున్నప్పుడే గొప్ప సినిమా అని అర్థమైపోయింది. దర్శకుడు శౌర్యువ్‌తో పనిచేయడం వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్. తను క్రియేట్ చేసిన మ్యాజిక్‌ని ఈ నెల 7న చూస్తారు' అని చెప్పింది మృణాళ్. నిర్మాతలు రాజీ అనే పదానికి తావివ్వకుండా పాషన్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారని, సాంకేతికంగా అద్భుతం గా ఈ సినిమా ఉంటుందని ఆమె అన్నారు.

## డంకీ ట్రైలర్ వచ్చేసింది..
## షారుక్‌ఖాన్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమేనా!




బాలీవుడ్ బాద్‌షా షారుక్‌ఖాన్ ఇప్పుడు ఫుల్‌ఫామ్‌లో ఉన్నాడు. హిందీ సినీ పరిశ్రమ సంక్షోభంలో ఉన్న సమయంలో పఠాన్, జవాన్ అంటూ వచ్చి వరస హిట్స్‌తో తనేంటో నిరూపించుకున్నాడు. ఒకే ఏడాదిలో రెండు బ్లాక్‌బస్టర్ సినిమాలతో వచ్చిన షారుక్.. ఇప్పుడు డంకీతో మూడో హిట్ అందుకోవాలని చూస్తున్నాడు. పైగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా వస్తున్న సలార్ సినిమాకు పోటీగా వస్తుండటంతో డంకీ సినిమాపై అంచనాలు మరింత ఎక్కువయ్యాయి. దీంతో అక్రమ వలసల నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా ఎలా ఉండబోతుంది? ఈ సినిమాతో షారుక్ హ్యాట్రిక్ కొట్టబోతున్నాడా? అని అంతా ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రేక్షకుల్లో మరింత హైప్ క్రియేట్ చేసేందుకు మేకర్స్ డంకీ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

# యుద్ధానికి సమయం ఖరారు?

'ధూమ్' సిరీస్‌లో జాన్‌అబ్రహం, హృతిక్, ఆమీర్‌ఖాన్‌లు పోషించిన సూపర్‌హీరోస్ పాత్రలపై ఓ బుక్ రాయొచ్చు. భారతీయ వెండితెరకు హాలీవుడ్ హంగులద్దిన పాత్రలవి. వాటి ప్రేరణతో 'వార్' చిత్రాన్ని కూడా నిర్మించింది యష్‌రాజ్ సంస్థ. ఇప్పుడు 'వార్-2'కి రెడీ అయ్యింది. ఇందులో సూపర్‌హీరోగా మన టాలీవుడ్ స్టార్ తారక్ కనిపించనుండటం విశేషం.
ఇది తెలుగు ప్రేక్షకులందరూ ఆనందించాల్సిన, గర్వించాల్సిన విషయమే. ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌లో బిజీగా ఉన్న తారక్ 'వార్-2' షూటింగ్‌లోకి ఎంట్రీ ఇచ్చేదెప్పుడు? అనే విషయంపై గతంలో పలురకాల వార్తలు వచ్చాయి. లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. వచ్చే ఏడాది మార్చి రెండోవారం నుంచి తారక్ 'వార్-2' షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు.
రెండువారాలపాటు ఈ షెడ్యూల్ జరుగుతుందని తెలిసింది. మళ్లీ ఏప్రిల్‌లో 'దేవర' షెడ్యూల్‌లో పాల్గొంటాడు తారక్. మళ్లీ మే నెలలో 'వార్-2' షెడ్యూల్ ఉంటుందట. ఈ షెడ్యూల్‌లో హృతిక్, తారక్‌లపై యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించనున్నాడు. దీనికోసం హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌ని రంగంలో



దించుతున్నారనేది లేటెస్ట్ న్యూస్.
ఇక 'వార్-2' కథ విషయానికొస్తే.. ఇది ఇద్దరు స్నేహితుల కథ అని తెలుస్తున్నది. కొన్ని కారణాల వల్ల ఇద్దరూ విడిపోతారట. కానీ మంచి కోసం మళ్లీ కలిసి చెడుపై యుద్ధం చేస్తారట. ఆ ఇద్దరు స్నేహితులుగా హృతిక్, తారక్ నటిస్తుండగా, జాన్‌అబ్రహం ఇందులో నెగిటీవ్ పాత్ర పోషించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. కైరా అద్వానీ కథానాయికగా ఖరారైనట్టు తెలుస్తున్నది.

ఆరోగ్య ధాత్రి

6-12-2023

బుధవారం

# రాంబూటాన్ రుచి చూశారా?



ఎర్రటి రంగుతో ఆకర్షణీయంగా కనిపించే రాంబూటాన్ పండు లిచీ పండ్లకు దగ్గరగా ఉంటుంది. ఇది ఉష్ణమండలంలో ఉన్న ఆగ్నేయాసియా దేశాలకు స్థానికమైంది. ఇందులో కెలోరీలు తక్కువగా, నీళ్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఈ పండు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. రాంబూటాన్‌లో నీళ్లు, ఫైబర్ ఉన్నందువల్ల వీటిని తింటే ఎక్కువసేపు కడుపు నిండినట్టుగా ఉంటుంది. దాంతో అతిగా ఆహారాన్ని తినకుండా అడ్డుకుంటుంది. ఊబకాయులకు ఇదొక వరం. బరువు తగ్గడానికి ఎంతో దోహదపడుతుంది.

ఈ పండు నీళ్లలో కరిగే, కరగని రెండు రకాల ఫైబర్స్‌కు గని. నీళ్లలో కరగని ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇక నీళ్లలో కరిగే ఫైబర్ పొట్టలో బ్యాక్టీరియాకు మేలుచేస్తుంది.

ఇందులో ఉండే నియాసిన్ విటమిన్ బి3 మన శరీరంలో జీవక్రియలను ప్రేరేపిస్తుంది. అలా శరీరం పనితీరును మెరుగుపరుస్తుంది. అంతర్గత రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

కొవ్వులో కరిగే ఎ, డి, ఇ, కె విటమిన్లు కూడా రాంబూటాన్‌లో సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను చైతన్యపరుస్తాయి. ఇందులోని విటమిన్-సి శరీరంలో తెల్ల రక్తకణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వయసు మీద పడకుండా చూస్తుంది. రాంబూటాన్ తొనలో ఎలాజిటనిన్ జెరానిన్ అనే పాలిఫినాలిక్ కాంపౌండ్ ఉంటుంది. ఇది జీవక్రియలు మందగించడానికి వ్యతిరేకంగా పోరాడుతుంది. ఆహారంలో అధిక కొవ్వు వల్ల తలెత్తే సమస్యలను నివారిస్తుంది.




# చిరుతిండే.. పెద్ద సమస్య

అనారోగ్యకరమైన చిరుతిండ్లతో పక్షవాతం, గుండెజబ్బుల ముప్పు పెరుగుతున్నదని ఓ తాజా అధ్యయనం తేల్చిచెప్పింది. ఇందులో భాగంగా నిపుణులు.. 854 మంది యువతీయువకుల చిరుతిండ్ల అలవాట్లను అధ్యయనం చేశారు. అధ్యయనంలో పాల్గొన్నవారిలో 26 శాతం మంది ఆరోగ్యకరమైన ప్రధాన ఆహారాన్ని ఎంచుకున్నా.. అధికంగా ప్రాసెస్ చేసిన, చక్కెరలు ఎక్కువగా ఉన్న చిరుతిండ్లకు అలవాటు పడిపోయారు. అనారోగ్యకరమైన చిరు తిండ్లకు%ూ% అధిక బరువును సూచించే బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) పెరగడానికి, శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోవడానికి, రక్తంలో అధిక చక్కెర స్థాయిల మూలంగా వచ్చే హైయర్ పోస్ట్‌ప్రాండియల్ రుగ్మతలైన పక్షవాతం, గుండె కవాటాల వ్యాధులు, ఊబకాయం తదితర సమస్యలతో సంబంధం ఉంటుంది. దీనికి భిన్నంగా గింజలు, తాజాపండ్లు లాంటి ఆరోగ్యకరమైన చిరుతిండ్లు మన జీవక్రియలను మెరుగ్గా ఉంచుతాయి. ఆకలిని తగ్గిస్తాయి.

ఈ అధ్యయనం యూరోపియన్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైంది. "మన శరీరంలో పావుభాగం కెలోరీలు 95 శాతం వరకు చిరుతిండ్ల నుంచే అందుతాయి. కాబట్టి, పరిపూర్ణ జీవితం కోసం బిస్కెట్లు, చిప్స్, కేకుల లాంటి అనారోగ్యకరమైన చిరుతిండ్ల నుంచి పండ్లు, గింజల వైపు మళ్లడం మంచిది" అంటున్నారు లండన్‌లోని కింగ్స్ కాలేజీకి చెందిన డాక్టర్ సారా బెరీ. అంతేకాదు%ూ% రాత్రి 9 గంటల తర్వాత చిరుతిండ్లు తీసుకోవడం కూడా మంచిది కాదట. మొత్తానికి మనం తినే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందనేది ఈ అధ్యయన సారాంశం. పండ్లు, కూరగాయలు, ప్రొటీన్లు, పప్పు ధాన్యాలు మొదలైన వాటితో కూడిన సమతులాహారంతో మీ పళ్లాన్ని సిద్ధం చేసుకోండి మరి!

# రోబోటిక్ సర్జరీ మంచిదే




సాంకేతికత పెరిగిపోవడంతో శస్త్ర చికిత్సలు సులభతరం అయ్యాయి. అందులోనూ రోబోటిక్ టెక్నాలజీ వచ్చాక.. కచ్చితత్వం, విజయాల రేటు మరింత అధికమైంది.

**విజువలైజేషన్**

రోబోలను రంగంలో దించడం వల్ల.. సర్జరీ చేయాల్సిన ప్రదేశాన్ని వైద్యుడు మరింత స్పష్టంగా చూడ గలుగుతాడు. త్రీ డైమెన్షన్‌లో.. పరిశీలించగలడు. దీంతో పని సులభం అవుతుంది. కణుతుల తొలగింపులో అవరోధాలు ఉండవు.

**రోబోటిక్ చేతులు**



రోబోటిక్ సర్జికల్ సిస్టమ్స్‌కు అమర్చిన కృత్రిమ చేతులు.. వైద్యుల శ్రమను తగ్గిస్తాయి. దీనివల్ల మానవ తప్పిదాలకు, నిర్లక్ష్యానికి ఆస్కారం ఉండదు.


**తక్కువ కోతలతో**

సాధారణ శస్త్ర చికిత్సతో పోలిస్తే.. రోబోటిక్ సర్జరీలో కోతలు తక్కువగా ఉంటాయి. దీంతో రోగి త్వరగా కోలుకుంటాడు. ఆసుపత్రిలో ఎక్కువ రోజులు గడపాల్సిన పరిస్థితి ఉండదు. గాటు గుర్తులు పెద్దగా ఏర్పడవు కాబట్టి, కాస్మటిక్ సర్జరీల అవసరమూ ఉండదు.

వైద్యులకూ సులభమేరోబోల సహకారం వల్ల సర్జన్ మీద ఒత్తిడి తగ్గుతుంది. దీంతో ప్రధాన లక్ష్యం మీద దృష్టి సారిస్తారు. గంటల తరబడి శస్త్ర చికిత్స చేయాల్సిన పరిస్థితుల్లోనూ అలసటకు గురికారు.

.నిజమే, సాధారణ సర్జరీతో పోలిస్తే ఇది కొంత ఖరీదైన వ్యవహారమే. కాకపోతే రానురాను ఆ వ్యయాలు నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంది. రోబోటిక్ ఎక్విప్‌మెంట్ ధరలు కూడా గతంతో పోలిస్తే కొంతమేర తగ్గాయి. ఇంకొంత తగ్గితే.. సాధారణ రోగులకు ఎంతో మంచి జరుగుతుంది. కార్పొరేట్ దవాఖానల మధ్య పోటీ వల్ల కూడా ధరలు నేలచూపులు చూడవచ్చు.

# హెల్త్ బిట్స్



వ్యాయామం మితంగా చేసినా గుండె రోగాలు ముప్పు తగ్గిపోతుంది. క్రమం తప్పని వ్యాయామానికీబీ గుండెపోటు, ఏట్రియల్ ఫైబ్రిలేషన్ (ఏఎఫ్ఐబీ) ముప్పు తగ్గడానికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ చేసిన తాజా అధ్యయనం వెల్లడించింది. ఇందులో 15,000 మంది పాల్గొన్నారు. వీరి సగటు వయసు 55 ఏండ్లు. వీరికి ఏఎఫ్ఐబీ ముందస్తు చరిత్ర లేదు. వీరంతా కూడా 2003 2012 మధ్య కాలంలో ట్రెడ్‌మిల్ మీద వ్యాయామం చేసినవారు కావడం గమనార్హం. ఇక సర్వేలో పాల్గొన్నవారి ఫిట్‌నెస్ స్థాయిని పరిశీలించడానికి మెటబాలిక్ ఈక్వలెంట్స్ (ఎంఈటీస్) అనే కొలతను ఉపయోగించుకున్నారు. ఇది పరీక్ష సమయంలో వారివారి వ్యాయామ సామర్థ్యాన్ని నిర్ధారించింది. ఎక్కువ ఎంఈటీ స్కోరు ఉన్నవాళ్లలో ఏఎఫ్ఐబీ 8 శాతం తక్కువని ఫలితాల్లో తేలింది. అదే ఇస్కిమిక్ స్ట్రోక్ ముప్పు 12 శాతం, గుండె కవాటాలకు సంబంధించిన రుగ్మతల ప్రమాదం 14 శాతం తక్కువని తేల్చారు.

**కాలుష్యంతో మెదడుకు చేటు**

డీజిల్ కాలుష్యం ఊపిరితిత్తులకు మాత్రమే కాదు, మెదడు పనితీరుకూ చేటు చేస్తుందట. యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా పరిశోధకుల అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. తమ పరిశోధన కోసం నిపుణులు కొద్ది మందిని ఎంపిక చేసుకున్నారు. వారిని విడతలవారీగా స్వచ్ఛమైన గాలి, డీజిల్ కాలుష్యం కలిసిన గాలి.. రెండూ పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఎంఆర్ఐ స్కాన్ చేశారు. డీజిల్ కాలుష్యం పీల్చినవారిలో మెదడు పనితీరూ మందగించినట్టు తేలింది. ఈ పరిశోధన ఫలితం తాత్కాలిక ప్రభావం గురించిందే అయినా, కాలుష్యం దెబ్బ దీర్ఘకాలంలో ఏమేరకు ఉంటుందన్నది తేల్చలేదు. అయితే, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినప్పుడు కార్లలో ప్రయాణిస్తున్నవారు కిటికీలు మూసివేయాలని, పాదచారులు, సైకిల్‌పై వెళ్లేవాళ్లు రద్దీలేని మార్గాలను ఎంచుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

**నిద్ర పుచ్చే పాప్‌సాంగ్స్**


పడుకునేటప్పుడు మంద్రంగా, మనసుకు ఆహ్లాదంగా ఉండే సంగీతమో, పాటలో వింటే మెల్లగా నిద్రలోకి జారుకుంటామనేది తెలిసిన విషయమే. డెన్మార్క్ పరిశోధకులు 100 మందికి పైగా సంగీత ప్రియులపై ఓ అధ్యయనం చేశారు. మామూలు లలిత గేయాలతోపాటు బీటీఎస్ మొదలుకుని బిలీ ఎలిష్ వరకు ప్రముఖ పాప్ గాయకుల హై ఎనర్జీ పాటలు విన్నా కూడా ఇదే ఫలితం కనిపించిందట. మంద్రంగా ఉండే పాటలు మాత్రమే కాదు.. మెదడును రోజువారీ ఒత్తిళ్ల నుంచి దారిమళ్లించేవి ఏవైనా సరే మనకు ఇట్టే కునుకు తెప్పిస్తాయట.

# రోజూ ఎంత ప్రొటీన్ తీసుకుంటే మేలు..!

శరీరం కీలక విధులను నిర్వర్తించేందుకు, జీవక్రియల వేగం పెంచేందుకు తగినంత ప్రొటీన్ () అత్యవసరం. శరీరానికి అత్యంత అవసరమైన మూడు సూక్ష్మపోషకాల్లో కొవ్వు, కార్బోహైడ్రేట్లతో పాటు ప్రొటీన్ ఒకటి. కండర నిర్మాణానికి, బరువు నియంత్రణకు, చర్మ ఆరోగ్యానికి, జుట్టు ఊడకుండా నిరోధించడంతో పాటు ప్రొటీన్ ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. అయితే కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్‌లా మన శరీరం ప్రొటీన్‌ను నిల్వ చేసకోదు కాబట్టి రోజువారీ తీసుకునే ఆహారంలో ప్రొటీన్ విధిగా ఉండేలా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.


దైనందిన జీవితంలో తగినంత ప్రొటీన్ తీసుకోకుంటే కండరాల బలహీనత, బరువు పెరగడం, అలసట, ఏకాగ్రత కొరవడటం వంటి అనేక ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయని పోషకాహార నిపుణులు, హెల్త్ కోచ్ శిల్పా అరోరా చెబుతున్నారు. ప్రొటీన్‌ను అధికంగా తీసుకున్నా, దాన్నిసరిగ్గా జీర్ణం చేసుకోలేకపోయినా ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. అసలు ప్రతి వ్యక్తి తన బరువులో కిలోకు 0.8 గ్రాముల చొప్పున ప్రొటీన్‌ను తీసుకోవాలని న్యూట్రిషనిస్ట్ దీప్తి జైన్ తెలిపారు.

ఉదాహరణకు 65 కిలోల వ్యక్తి రోజుకు 52 నుంచి 65 గ్రాముల వరకూ ప్రొటీన్ తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే వయసు, బరువు, ఫిట్‌నెస్, చేసే పనులు, ఆరోగ్య పరిస్థితుల ప్రకారం ఆయా వ్యక్తులు తమకు తగినంత ప్రొటీన్‌ను తీసుకోవాలి. ఇక ప్రొటీన్ సరిగ్గా జీర్ణమయ్యేందుకు, రక్తం గడ్డకట్టడాన్ని నివారించేందుకు, ఇన్‌ఫ్లమేషన్



నిరోధించడం వంటి ప్రయోజనాల కోసం ప్రొటీయోలిటిక్ ఎంజైమ్‌లను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఈ ఎంజైమ్స్ అధికంగా పపాయ, పైనాపిల్, కివీ, పులిసిన కూరగాయలు, అల్లం, పెరుగు వంటి ఆహార పదార్థాల్లో అధికంగా ఉంటాయని న్యూట్రిషనిస్ట్ సిమ్రన్ చోప్రా చెప్పారు.

# అందాల విటమిన్




అందం అనేది ఆరోగ్యంలో ఓ భాగం. పరిపూర్ణ ఆరోగ్యవంతుల చర్మం ఏ రంగులో అయినా కాంతి వంతంగా ఉంటుంది. కళ్లలో వెలుగు కనిపిస్తుంది. కేశాలు ఒత్తుగా ఉంటాయి. కాబట్టి అందాన్నీ, ఆరోగ్యాన్నీ విడదీసి చూడకండి. సౌందర్యంతో విటమిన్-ఎ నేరుగా ముడిపడి ఉంటుంది.

అందం అనేది ఆరోగ్యంలో ఓ భాగం. పరిపూర్ణ ఆరోగ్యవంతుల చర్మం ఏ రంగులో అయినా కాంతి వంతంగా ఉంటుంది. కళ్లలో వెలుగు కనిపిస్తుంది. కేశాలు ఒత్తుగా ఉంటాయి. కాబట్టి అందాన్నీ, ఆరోగ్యాన్నీ విడదీసి చూడకండి. సౌందర్యంతో విటమిన్-ఎ నేరుగా ముడిపడి ఉంటుంది. ఇది కొవ్వులో కరిగిపోతుంది. తల్లి పొట్టలో పిండం అభివృద్ధి, చర్మం బిగుతుదనం, కంటిచూపు, రోగ నిరోధక శక్తి పెరుగుదల, బిడ్డ ఎదుగుదల.. తదితర అంశాలను ఇది ప్రభావితం చేస్తుంది. విటమిన్-ఎలోని రెటినాల్‌ను సౌందర్య చికిత్సలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది ముడతలను నివారిస్తుంది. మచ్చల నుంచి కాపాడుతుంది. సూర్యరశ్మి వల్ల దెబ్బతినకుండా చర్మానికి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఈ విటమిన్‌తో ముడిపడిన సౌందర్య చికిత్సలను, ఔషధాలను ఎంచుకునేటప్పుడు నిపుణుల పర్యవేక్షణ అవసరం. టమాట, క్యారెట్, బొప్పాయి, గుమ్మడి, గుడ్డుసొన మొదలైన వాటిలో సహజమైన విటమిన్-ఎ అపారంగా లభిస్తుంది.



- నాయకుల తప్పిదాలతో బీసీ ల్లో ఐక్యత సాధ్యం కావట్లేదు.
- పూలే, అంబేద్కర్ ల స్ఫూర్తి నింపుకున్న వాణ్ణి కాబట్టే మాదిగల ఉద్యమంలో దాదాపు 15 ఏళ్లు పనిచేసా.
- బీసీ ఉద్యమ అవసరాన్ని ఈ ఎన్నికలుబహిర్గతం చేశాయి.
- బీసీ లను అన్ని రంగాల్లో తిరుగులేని శక్తి గా నిలబెట్టే వరకు శ్రమిస్తా!
- బీసీ రక్షణ సమితి ఆవిర్భావం!

# బీసీ ల గొంతుకనవుతా!

- బీసీ ముఖ్యమంత్రి నినాదాన్ని కూడా అర్థం చేసుకోలేని పరిస్థితి
- బీసీ ల ప్రాతినిధ్యం చట్టసభల్లో తగ్గుతుండడం ప్రమాదకరం
- కాంగ్రెస్ పార్టీ కి, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కి శుభాకాంక్షలు
- బీసీ లకు డిప్యూటీ సీఎం ఇవ్వాలి, బీసీ మంత్రుల సంఖ్యను పెంచాలి.
- రక్షణ , రిజర్వేషన్ , రాజ్యాధికారం ఎజెండా తో పోరాడుతాం.
- బీసీ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు తీగల ప్రదీప్ గౌడ్



**సోమాజి గూడ,నేటిధాత్రి:**
గత 15 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ పోరాటంలో పేద వర్గాలైన మాదిగ, మాదిగ ఉప కులాల పక్షాన ఉద్యమంలో కీలక పాత్ర పోషించాను అని ఇక బీసీ ప్రజల గొంతుకనయ్యి ఉద్యమిస్తానని మహాజన సోషలిస్ట్ పార్టీ మాజీ అధ్యక్షులు తీగల ప్రదీప్ గౌడ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహాజన సోషలిస్ట్ పార్టీ కి, రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన ఆయన ఈ రోజు సోమాజుగూడ ప్రెస్ క్లబ్ లో భవిష్యతు కార్యాచరణ ప్రకటించారు.బీసీ రక్షణ సమితి పేరుతో సామాజిక ఉద్యమ సంస్థ ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ పోరాటం లో సుధీర్ఘ కాలం భాగస్వామ్యం అవడం అదృష్టంగా బావిస్తున్న అన్నారు. మంద కృష్ణ మాదిగ 30 ఏండ్ల స్వప్నం నెరవేరినట్లే అని, ఎస్సీ వర్గీకరణకు అడ్డంకులేం లేవని స్పష్టం చేశారు. ఈ తరుణంలో అక్కడ నా అవసరం కన్న బీసీ వర్గాల్లో ఉన్న అనైక్యతను రూపుమాపడమే కర్తవ్యంగా బావించి ఎంఎస్పీ కి రాజీనామా చేసానని తెలిపారు. కృష్ణ మాదిగ ఉద్యమ స్ఫూర్తి తో బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తానని ఆశ భావం వ్యక్తం చేశారు. బీసీ లకు రక్షణ లేదని, బీసీ లు ఏ స్థాయిలో ఉన్నా ఒక భయం వెంటాడుతూనే ఉందన్నారు .ఎస్సీ ఎస్టీ లకు అట్రాసిటీ ఆక్ట్ ఉన్నట్లుగానే బీసీ ల రక్షణకు చట్టం తేవాలన్నారు . బీసీ ల పరిస్థితి అడకత్తెర లో పోక చెక్క ల మారింది అన్నారు. అగ్ర కులాలతో సహజంగా ఉండే వివక్ష ,అణిచివేత ఒక వైపైతే , కొంత మంది ఎస్సీ ఎస్టీ ల వల్ల కూడా బీసీ లు భయపడే పరిస్థితి ఉండడం బాధాకరమన్నారు. ఎస్సీ,ఎస్టీ ల పైన ఎలాంటి అట్రాసిటీ జరిగిన, అది ఎవరు చేసిన చట్టప్రకారం శిక్ష పడేలా మనమే ముందుండాల్సిన అవసరం ఉందన్నారు. కొంత మంది వల్ల చట్టం దుర్వినియోగం అవుతుందన్న భావన వాస్తవం అని ,అది ముఖ్యంగా బీసీ ల విషయంలో ఎక్కువగా జరుగుతుందనే భావన సమాజం లో ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ ని కాపాడుకుంటూనే బీసీ ల రక్షణ కోసం చట్టం తేవడం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అన్యాయంగా బీసీ ల పైన పెట్టిన అక్రమ కేసు ల పట్ల ,బీసీ ల భూ ఆక్రమణ ల పట్ల , బీసీ ఉద్యోగస్థుల రక్షణ పట్ల చిత్తశుద్ధి తో పని చేస్తామన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ లు ఏదో ఒకరోజు ఏకం కావాల్సిందే అని రాజ్యాధికార ప్రయాణం చేయాల్సిందే అని అన్నారు.
75 సంవత్సరాల చరిత్రలో బీసీ ముఖ్యమంత్రి చేసుకొనే అవకాశం రాలేదని, ఈ సారి బీజేపీ పార్టీ బీసీ ముఖ్యమంత్రి ని చేస్తామని ప్రకటించిన బీసీ ల ఐక్యత ఎక్కడ కనిపించ లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్న ఈటెల రాజేంద్ర, బండి సంజయ్ లు కూడా గెలవలేని పరిస్థితి రావడం అంటే బీసీ లకు రాజ్యాధికారం పైన ఆకాంక్ష ఏ మేరకు ఉందో ఇదొక సాక్ష్యం అని అన్నారు. బీసీ ల ప్రాతినిధ్యం చట్టసభల్లో తగ్గుతుండడం పెను ప్రమాదమని అని అన్నారు. 2014 లో బీసీ ఎమ్మెల్యే ల సంఖ్య 24 ఉంటే 2018 లో 20 కి వచ్చిన్నని 2023 అది 18 కి పడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.సకలజనుల సర్వే ప్రకారం తెలంగాణ లో 62 శాతం బీసీ లు ఉన్నారని తేలిందని అన్నారు. కానీ ఎమ్మెల్యే ల సంఖ్య 15 శాతం మాత్రమే ఉండడం బిసి ల దుస్థితి కి నిదర్శనం అన్నారు.
నూతనంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కి, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.కేసీఆర్ గత ప్రభుత్వంలో ముస్లిం కి డిప్యూటీ సీఎం ఇచ్చి గౌరవించారని, ప్రస్తుతం డిప్యూటీ సీఎం లు గా ఒక ఎస్సీ , ఒక ఎస్టి, సీఎం గా రేవంత్ రెడ్డి కి అవకాశం అంటున్న నేపథ్యం లో ఒక బీసీ కి డిప్యూటీ సీఎం ఇవ్వడం న్యాయమని .పక్కా రాష్టం లో డిప్యూటీ సీఎం లు 5 గురు ఉన్నారని గుర్తు చేశారు. అదేవిందంగా బీసీ లకు 50 శాతం వాటా కాబినెట్ కల్పించాలని విజ్ఞప్తి చేసారు.
బీసీ రక్షణ సమితి రక్షణ, రిజర్వేషన్, రాజ్యాధికారం లక్ష్యంగా పని చేస్తుంది అని తెలిపారు. చట్టసభల్లో రిజర్వేషన్ లను సాధించడంతో పాటు అన్ని రంగాల్లో మనం ఎంతో అంత రియర్వేషన్ కోసం ఉద్యమిస్తామని తెలిపారు.

## నిరుపేద ఆదివాసీ అడవి బిడ్డకు
# ఉన్నత ఉద్యోగం

- తొలి ప్రయత్నంలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ గా డాక్టర్ సుమతి పోలేబోయిన
- పలువురు మహిళాలకు ఆదర్శ వంతురాలు
- చదువుకు పెళ్లి అడ్డురాదని నిరూపణ
- భర్త ప్రోత్సాహంతోనే నేడు ఉన్నత ఉద్యోగం
- స్వదేశంలోనే శాస్త్రవేత్తగా ఎదిగి సేవలు చేయాలనే సంకల్పం
- రెండు తెలుగు రాష్ట్రల నుండి సెంట్రల్ యూనివర్సిటీ లో ఉద్యోగం సాధించిన తొలి ఆదివాసీ గిరిజన మహిళాగా ఘనత పేరు ప్రాఖ్యత



మంగపేట- నేటిధాత్రి:
నిరు పేద గిరిజన కుటుంబం లో పుట్టి చదువు కోవడానికి ఆర్థిక స్థోమత సరైన సౌక ర్యాలు లేకున్న ఉన్నత చదు వు చదువుకొని సమాజంలో మహిళాలు ఎందులోను తక్కువ కాదు అని ఉన్నత మైన స్థాయిలో ఉండలనే ఆమె దృఢ సంకల్పంతో పెళ్లి అయిన కూడా భర్త కొమరం మోహన్ రావు ప్రోత్సాహంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం ను డాక్టర్ కొమరం సుమతి మోహన్ తొలి ప్రయత్నంలోనే సాదించి పలువురు మహి ళాలకు ఆదర్శంగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా మారు మూల ఏజెన్సీ లోని మంగపేట మండలం రమణక్కపేట గ్రామంకు చెందిన కొమరం మోహన్ రావు (మాజీ సర్పంచ్) సతీమణి డాక్టర్ కొమరం సుమతిమోహన్ మొదటి ప్రయ త్నంలోనే (సిజి) రాష్ట్రం గురుఘాసి దాస్ సెంట్రల్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సెంట్రల్ గవర్న మెంట్ ఉద్యోగం సాధించిన తొలి ఆదివాసి గిరిజన మహిళగా డాక్టర్ పోలేబోయిన సుమతి నిలిచారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పినపాక నియోజకవర్గం ఉమ్మడి పినపాక మండలం ప్రస్తుతం కరకగూడెం మండలం కొర్నాపల్లి గ్రామం కు చెందిన డాక్టర్ పోలేబోయిన సుమతి నిరుపేద ఆదివాసీ కుటుంబం లో పోలేబోయిన పుల్లయ్య, లక్ష్మి నర్సమ్మ దంపతులకు చిన్న కుమార్తెగా సుమతి జన్మించింది చిన్నప్పటి నుంచి చదువుకోవాలనే పట్టుదలతో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ముందుకు సాగి ఉన్నత చదువు అభ్యసించింది.పదో తరగతిలో 88.5% ఇంటర్ లో 91.3% మార్కులతో ఆమె విద్య అభ్యసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలో జరిగింది మరియు ప్రభుత్వ విశ్వ విద్యాలయలలో 2008 నుంచి 2012 వరకు వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో బి ఫార్మసి 84.16%, మార్కులతో పూర్తి చేసింది తన చదువు మధ్య లోనే 2009 ఏప్రిల్ 29 న ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేటకు చెందిన కొమరం మోహన్ రావు తో వివాహం జరిగింది. పెళ్లి చదువుకు అడ్డు కాదని అస్సాం లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మాసుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ లో యం.స 8.92 సీజీపిఏ తో మరియు.నేషనల్ ఇన్స్టి ట్యూట్ అఫ్ ఫార్మాసుటికల్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ లో పీహెచ్డీ 9.67 సీజీపిఏ తో ఇప్పటి వరకు ఓటమి లేకుండా అన్నిటిలోను ప్రధమ శ్రేణిలో పాస్ అవుతు చదువు పూర్తి చేసింది.పీహెచ్డీ పూర్తి అయిన తదనంతరం ప్రస్తుతం బి.వి. రాజు విద్య సంస్థలకు (బి విఆర్ఐటీ) కు చెందిన విష్ణు ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మా సుటికల్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సేవలు అందిస్తున్నారు.

### భర్త ప్రోత్సాహంతోనే ఉన్నత ఉద్యోగం

తన భర్త ప్రోత్సాహంతోనే ఉన్నత చదువు చదువుకొని నేడు సెంట్రల్ గవర్నమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం సాధించానని అన్నారు.తను చదువుకునే సమయంలో ఓ బిడ్డకు కూడ జన్మను ఇచ్చిన తన బిడ్డ అలాన పాలనా చూసుకుంటునే చదువుకునే దానినని ఒక్కోసారి కళాశాల నుంచి ఇంటికి వెళ్లి ఇంట్లో పని మరియు బిడ్డ అలాన పాలనా చూసుకోని చదుకొని నిద్ర పోయే వరకు తెల్ల వారు జాము 3 గంటలు అయ్యేదని తెలిపింది.ఎన్నోసార్లు ఇబ్బంది అయి, చదువు ఆపేద్దాం అనే అనుకున్న కానీ నా భర్త ప్రోత్స హించి అండగా ఉన్నాడని, నేనున్నా అంటూ ప్రోత్సా హాన్ని ఇచ్చి ముందుకు నడిపించాడని తెలిపారు.

### సంకల్పం ఉంటే పెళ్లి అడ్డు కాదు

పెళ్లి అయినా సరే పట్టు వదలని విక్రమార్కుడిగా పోరాటం చేసి తాను అనుకు న్నది సాధించాలనే పట్టుద లతో తన భర్త కొమరం మోహన్ రావు ఇచ్చిన ప్రోత్సాహంతోనే నేను ఉన్నత చదువులు చదివి నేడు సెంట్రల్ గవర్న మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్గా ఉద్యోగం సాధించానని చాలా మంది మహిళలు మాకు పెళ్లయింది మేమేం సాధించ లేం అంటూ చదువు మధ్య లోనే మానివేసి నిరుత్సాహంతో ఉంటున్నా రని చదువు కోవాలనే పట్టు దల భర్త ప్రోత్సాహం ఉంటే ప్రతి మహిళ సమాజంలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధిస్తారని అన్నారు.

### డాక్టర్ కొమరం సుమతి మోహన్ మనసులోని మాట

శాస్త్రవేత్తగా (సైంటిస్టుగా) ఎదగాలి అనేది నా లక్ష్యం ప్రపంచంలో ఉన్న మాన వాళిని వివిధ రకాల వ్యాధుల నుంచి కాపాడాలని లక్ష్యంతో వివిధ వ్యాధుల నిర్మూలనకు తన వంతు కృషి చేయాలని వాటి పై పలు రకాల పరిశో దనలు చేసి కొమరం భీమ్ వారసురాలిగా ఆయన ఆశయా సాధనలతో,సంకల్ప లక్ష్యాలతో ముందుకు సాగుతూ పేద ప్రజలకు సేవా చేయడమే నా జీవిత ఆశయం అని తెలిపారు.

# ప్రజలు సాధించిన విజయం

## కాంగ్రెస్ పార్టీ మొగుళ్ళ పల్లి టౌన్ అధ్యక్షులు రమేష్



మొగుళ్ళపల్లి,నేటిధాత్రి:
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షు లు క్యాతరాజు రమేష్ చరవాణి ద్వారా పత్రిక విలేకరులతో మాట్లాడు తూ భూపాలపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు భారీ మెజార్టీతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అత్యధిక మెజార్టీతో గెలిపించిన భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు అదేవిధంగా గండ్ర సత్యనారాయణ గెలుపు కోసం శ్రమించిన కాంగ్రెస్ పార్టీ నాయకు లకు కార్యకర్తలకు శుభాభివందనాలు తెలియజేస్తున్న గత బిఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల నర పరిపా లించడం జరిగింది
కానీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటు వంటి ప్రజలకు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనా ర్టీ ఓసి లో ఉన్నటువంటి నిరుపేద కుటుంబాలకు ఎలాంటి న్యాయం జరగలేదు కానీ కెసిఆర్ కుటుంబం మాత్రం అందరూ బాగుపడ్డారు తెలంగాణలో ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు ఉద్యోగం లేదు కానీ కెసిఆర్ కుటుంబంలో ఉన్నటువంటి ఆ నలుగురికి మాత్రం పది సంవత్సరాలు లక్షల కోట్ల ఆస్తులు సంపాదించి వారికి తరతరాలు వారి, కుటుంబానికి సరిపడే ఆస్తిని సంపాదించినారు ఎందరో నిరుద్యోగ విద్యార్థులు ప్రాణాలు అర్పిస్తే తెలంగాణ సాధించుకునారు . కానీ తెలంగాణ రాష్ట్రంలో చనిపోయినటువంటి అమరవీరులకు వారి కుటుంబాలకు ఎలాంటి దిక్కు దశ లేదు గత సుమారు 75 సంవత్సరాల క్రితం భారతదేశాన్ని ఆనాడు తెల్ల దొరలు ఏ విధంగా హింసలు పాలు చేసి చిత్రహింసలు పెట్టి పరిపాలించారో గత తొమ్మిది సంవత్సరాల నుండి ఈ దొరలు ఈ కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఎన్నో కష్టాల పాలు చేసినారు అలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు తిరగబడి ఓటు హక్కు అనే వజ్రాయుధంతో భారత రాష్ట్ర సమితి పార్టీ కి దిమ్మ తిరిగే విధంగా షాక్ ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రుణపడి ఉంటుందని అలాగే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని తెలంగాణ ప్రజలకు హామీ ఇస్తున్నాం, ఈ గెలుపు సాధించిన విజయం ఇది ప్రజలు సాధించిన విజయం అన్నారు


# అప్రమత్తంగా ఉండాలి

## వర్షాల దృష్ట్యా కలెక్టర్లతో సీఎస్ శాంతి కుమారి టెలీ కాన్ఫరెన్స్



**హైదరాబాద్,నేటిధాత్రి:**
మిగ్‌జాం తుపాను కారణంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తోన్న విషయం తెలిసిందే. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు ఐఎండీ ప్రకటించింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అప్రమత్తమయ్యారు. వర్షాల దృష్ట్యా ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారువర్షాలు పడే అవకాశం ఉన్నందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ సూచించారు. పూర్తిగా నిండిన చెరువులకు గండ్లు పడకుండా చూడాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. భద్రాద్రి, ములుగు జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నామని తెలిపారు. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి, వరద నివారణ చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు.

# ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



**హైదరాబాద్,నేటిధాత్రి:**
మిగ్‌జాం తుఫాను కోస్తాంధ్ర తీరానికి సమాంతరంగానే కదులుతున్నదని వాతావరణ శాఖ తెలిపింది. తుఫానులో కొంతభాగం సముద్రంలో, మరికొంతభాగం భూమిపై ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. తీరానికి అత్యంత దగ్గరగా తీవ్ర తుఫాను కదులుతున్నదని, తుఫాను కేంద్రంలోని మేఘాలు భూభాగంపై ఉన్నట్లు పేర్కొంది. గడిచిన 6 గంటలుగా గంటకు 7 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా తీవ్ర తుఫాను కదులుతున్నదని చెప్పింది. కావలి తీరానికి 40 కిలోమీటర్లు, బాపట్లకు 80 కిలోమీటర్ల దూరంలో తీవ్రతుఫాను కేంద్రీకృతమై ఉన్నదని తెలిపింది. ప్రస్తుతం తీరప్రాంతంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని ప్రకటించింది.మిగ్‌జాం తుఫానుప్రభావంతో రాష్ట్రంలోని ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుందని వెల్లడించింది. ఈనేపథ్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. ఈ జిల్లాల్లో అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. తుఫాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నారు. భద్రాచాలం, అశ్వారావుపేట, నేలకొండపల్లి, ఇల్లందు, అన్నపురెడ్డి పల్లి, కల్లూరు, ఆళ్లపల్లి, సత్తుపల్లి, దమ్మపేట, కూసుమంచి, కారేపల్లి మండలాలతోపాటు పాల్వంచ, తిరుమలాయపాలెంలో జోరుగా వర్షం కురుస్తున్నది. సత్తుపల్లిలో కురుస్తున్న వర్షానికి జేవీఆర్ఓసీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, మేడ్చల్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, హైదరాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ప్రజలకు సూచించింది. ఎత్తయిన ప్రదేశాలు, చెట్ల కింద ఉండొద్దని హెచ్చరించింది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి, ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. నేడు, రేపు భారీ వర్షం కురుస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రాద్రి, ములుగు జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పంపిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నిండిన చెరువులకు గండ్లు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇక మంగళవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట, కత్బుల్లాపూర్, సుచిత్ర, రాయదుర్గం, బహదూర్‌పల్లి, సూరారం, మియాపూర్, చందానగర్, మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, మూసాపేట, ప్రగతినగర్, నిజాంపేట్, మేడ్చల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, గండిమైసమ్మ, బోరబండ, అల్లాపూర్, రహమత్‌నగర్, మధురానగర్, సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్, మైత్రివనం, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎల్బీనగర్, హయత్‌నగర్, ఉప్పల్, బీఎన్‌రెడ్డిలో వర్షం కురిసింది.

# గెలుపుతో మోకాళ్లపై మొక్కులు

**జనగామ,నేటిధాత్రి:**
పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్విని రెడ్డి గెలిచిన సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన పార్టీ కార్యకర్త జూకంటి బీరన్న స్థానిక శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. సోమవారం మోకాళ్లపై ఆలయ మెటె÷–లెక్కి మొక్కులు తీర్చుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలో కాంగ్రెస్ గెలిచినందుకు మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈరవెన్ను గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు మెట్టుకో కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా సోమేశ్వర్ మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఇదే మొదటిసారి అన్నారు. యశస్వినిరెడ్డిని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేసిన వినయ్ భాస్కర్

**హన్మకొండ,నేటిధాత్రి:**
మొన్నటి ఎన్నికల్లో ఓడిపోవడంతో హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని దాస్యం వినయభాస్కర్ ఖాళీ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన వినయభాస్కర్... కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి చేతిలో ఓటమి చెందారు. గత ప్రభుత్వంలో ఆయన చీఫ్‌విప్‌గా పనిచేశారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలను కట్టించారు. ఈ క్రమంలో ఆయన సోమవారం అధికారిక క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేశారు. హంటర్‌రోడ్డులోని విల్లాకు మారారు. క్యాంపు కార్యాలయాన్ని ఖాళీ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న అభిమానులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి వినయభాస్కర్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. ఇన్నేళ్ల అనుబంధాన్ని పంచుకున్నారు. వారిని చూసి వినయభాస్కర్ కూడా చలించిపోయారు. బాధతో అభిమానులను ఓదార్చారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. అలాగే నిరంతరం ప్రజల్లోనే ఉంటామని అన్నారు.

# తుఫాను ప్రభావం.. ఈ జిల్లాలో పాఠశాలలకు సెలవ్..!



**హన్మకొండ,నేటిధాత్రి:**
మిగ్‌జాం తుఫాను ప్రభావంతో తమిళనాడు, ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే, తెలంగాణలోనూ తుఫాను ప్రభావంతో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని విద్యాసంస్థలకు రేపు (బుధవారం) జిల్లా అధికార యంత్రాంగం సెలవు ఇచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలన్నీ మూసే ఉంచాలని జిల్లా విద్యాధికారి ఆదేశించారు.
భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. తప్పనిసరిగా బుధవారం పాఠశాలల్లో తరగతులు నిర్వహించొద్దని స్పష్టం చేశారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు బయటకు రావొద్దని.. హాస్టల్స్‌లోనే ఉండాలన్నారు. మిగ్‌జాం తుఫాను ప్రభావంతో బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మరో వైపు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెంలో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా అశ్వారావుపేటలో 14 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. అలాగే దమ్మపేటలో ఎనిమిది సెంటీమీటర్ల వరకు వర్షాపాతం నమోదైంది. అలాగే, పలుమండల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H.No. 7-1-133/3, Opp.New Bus Stand, Laxmipuram,Hanamkonda, Warangal Urban-506001. Telangana State. & Published from, H.No 7-1-133/3. Opp New Bus Stand, Laxmipuram, Hanamkonda, Warangal Urban-506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. AP TEL 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999